# 'అంతర్జాతీయ కృత్రిమ అనుసంధానం'

నేటినిజం
మంగళవారం 30-7-2019

ప్రపంచీకరణ'- గ్లోబలైజేషన్- పేరుతో జరిగిపోతున్న అనేక ఘోరాలలో, ఆర్థిక నేరాలలో భూ బకాసురత్వం' అతి ప్రధానమైనది. కానీ ఘోరాలు నేరాలు అక్రమాలు సక్రమమై పోవడం, చట్టబద్ధమై పోవడం 'మార్కెట్ ఎకానమీ' సృష్టిస్తున్న మాయాజాలంలో భాగం. మార్కెట్ ఎకానమీ- స్వేచ్ఛా విపణి వ్యవస్థ- ఏర్పరచిన 'అంతర్జాతీయ కృత్రిమ అనుసంధానం' ఫలితంగా విదేశాల నుంచి 'బహుళ జాతీయ వాణిజ్య సంస్థలు' మల్టీ నేషనల్ కంపెనీలన్నీ మన దేశంలోకి చొరబడిపోయాయి. ఈ దోపిడీ సంస్థలకు వందల,వేల,లక్షల ఎకరాల వ్యవసాయ భూమిని, అటవీ భూమిని కట్టబెట్టడం పాతికేళ్లకు పైగా ప్రభుత్వాల ప్రధాన కార్యక్రమం అయిపోయింది. ప్రజల సమష్టి హితానికి ప్రభుత్వం నిర్వహించే పథకాల కోసం అటవీ భూమిని కేటాయించడం, వ్యవసాయ భూమిని సేకరించడం ఒకటిన్నర శతాబ్దులకు పైగా ఈ దేశంలో నడిచిన కథ. వాణిజ్య సంస్థలు తమకు కావలసిన భూమిని తమంత తాము కొనుగోలు చేసుకోవలసి వచ్చేది.

ప్రభుత్వేతర వాణిజ్య పారిశ్రామిక సంస్థల లక్ష్యం ప్రధానంగా తాము లాభాలను ఆర్జించడం మాత్రమే, ప్రజల సమష్టి హితం ఈ సంస్థల లక్ష్యం కాదు, కాలేదు. స్వదేశీయ వాణిజ్య సంస్థలకు ఈ దేశం పట్ల మమకారం ఉంది, జాతీయతా నిష్ఠ ఉంది. ఇది సాధారణ నియమం. ఈ 'నిష్ఠ',మాతృదేశ మమకారం లేని విద్రోహులు వాణిజ్య పారిశ్రామిక వేత్తలలో ఉన్నారు. ఇది అపవాదం. అంతర్జాతీయ అనుసంధానం ఫలితంగా దేశంలోకి చొరబడిన విదేశీయ సంస్థలకు ఈ దేశం పట్ల మమకారం సహజంగానే లేదు. తక్కువ పెట్టుబడులతో ఈ దేశ ప్రజల నుండి ఇబ్బడి ముబ్బడిగా లాభాలను సంగ్రహించుకొని తమ దేశాలకు తరలించుకొని వెళ్లడం ఈ విదేశీయ సంస్థల లక్ష్యం! ఇలాంటి విదేశీయ సంస్థలకు, బహుళ జాతీయ సంస్థలకు ప్రభుత్వాలు నడుములను బిర్రుగా బిగించుకొని ప్రజల నుండి భూమిని సేకరించి పెట్టవలసిన అవసరం లేదు. ఆయా విదేశీయ సంస్థలు కాని, స్వదేశీయ వాణిజ్య సంస్థలు కాని తమ పరిశ్రమల స్థాపన కోసం లేదా వ్యాపార కలాపాల కోసం వలసిన భూములను ప్రభుత్వం నుంచి కాని వ్యవసాయదారుల నుంచి కాని కొనుగోలు చేసుకోవాలి. ఈ కొనుగోలు వ్యవహారంలో ప్రభుత్వాల జోక్యం ఉండరాదు. విదేశీయ సంస్థలు మన దేశంలో పరిశ్రమలను పెడుతున్నది, సేవలను అందిస్తున్నది మన దేశ ప్రజలను ఉద్ధరించడానికి కాదు, కేవలం తమ లాభాల కోసమే. కానీ ప్రపంచీకరణ మొదలైన తరువాత మన ప్రభుత్వాలు మన దేశంలో పెట్టుబడులకోసం వెంటపడటం ఆరంభమైంది. ఇలా పెట్టుబడులను మోసుకొని వస్తున్న వారికోసం ప్రభుత్వాలు కారుచౌకగా భూమిని సేకరిస్తున్నాయి, విద్యుత్తును ఇంధనాన్ని దాదాపు ఉచితంగా సరఫరా చేస్తున్నాయి. ఏళ్లతరబడి సకల విధ శుల్కాల నుంచి సుంకాల నుంచి ఈ విదేశీయ సంస్థలకు మినహాయింపులను ఇస్తున్నాయి. ఇందులో భాగంగానే 1894నాటి భూమి సేకరణ చట్టం' కింద వ్యవసాయదారుల నుంచి భూమిని లాక్కొని పారిశ్రామికవేత్తలకు సమర్పించడం మొదలైంది. ఈ బ్రిటన్ దురాక్రమణ నాటి చట్టం కాలదోషం పట్టిందని సర్వోన్నత న్యాయస్థానం పదే పదే వ్యాఖ్యానించడం 2013లో ప్రభుత్వం కొత్తగా భూమి సేకరణ చట్టాన్ని చేసింది.. ఇదంతా చాలదన్నట్టు 2005-2006 నుంచి అమలు జరుగుతున్న 'ప్రత్యేక ఆర్థిక మండలుల' చట్టం మన వ్యవసాయ భూమికి 'చీడ'లాగా తయారైంది, మన అడవుల పాలిట 'గొడ్డలి'గా మారింది. ఈ చట్టం ప్రకారం జరుగుతున్న లక్షల ఎకరాల భూమి సేకరణ కార్యక్రమం ఆకుపచ్చని అడవులలో చిచ్చుపెట్టింది, వ్యవసాయ భూములను రక్తసిక్తం చేసింది. 'పోస్కో' 'వేదాంత' 'లావాసా' డీబీర్స్' 'అరేనా'వంటి సంస్థల పారిశ్రామిక ప్రాంగణాల ఏర్పాటుకు వివిధ రాష్ట్రాలలో ప్రభుత్వాల వారు రైతుల కళ్ల ఎదుటనే వరి పొలాలకు నిప్పుపెట్టడం చరిత్ర. తమలపాకుల తోటలను, కాచేపూచే ఫల వృక్షాలను నరికి వేయడం చరిత్ర! ఎలాంటి రాయితీలను కల్పించకపోయినప్పటికీ వ్యాపారం చేసుకొని లాభాలను ఆర్జించదలచే విదేశీయ సంస్థలు మన దేశంలో పెట్టుబడులను పెడతాయి. కానీ మన ప్రభుత్వాలు ఎపుడైతే పెట్టుబడులకోసం వెంటపడటం మానేస్తారో అపుడు విదేశీయులు కూడా మనల్ని పట్టించుకుంటారేమో.. ఆలోచించాలి.

## కన్నీరు పెట్టిన పాలమూరు ప్రజలు

### ఆయన మరణంతో ప్రజల మనోవ్యథ

మహబూబ్‌నగర్,జూలై29(ఆర్ఎన్ఎ): 1984లో మహబూబ్‌నగర్ ఎంపీగా జనతాపార్టీ నుంచి ఎంపికైనప్పటి నుంచి 2014 వరకు జాతీయ రాజకీయాల్లో క్రియాశీలకంగా మెరిసిన జైపాల్ రెడ్డి మృతి పాలమూరు వాసులను కన్నీరు పెట్టించింది. ఆయనను కడసారి చూసి నివాళి అర్పించేందుకు ఉమ్మడి జిల్లా నుంచి అనేకులు హైదరాబాద్ వెళ్లారు. శాసనసభలో, పార్లమెంటులో ఆయన ఏ అంశంపైనైనా సాధికారతతో చేసే ప్రసంగం ప్రతి ఒక్కరినీ ఆకట్టుకునేది. అలాంటి తమ నేత ఇక లేడన్న వార్త వారిని కలచివేసింది. ఏ సమస్య పైనైనా మాట్లాడ గలిగే వాగ్దాటి కలిగిన సామర్థ్యమే ఆయనను విద్యార్థి రాజకీయాల నుంచి కేంద్ర మంత్రి స్థాయికి ఎదిగేలా చేసింది.. దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసేలా చూసింది. చదువుకునే సమయంలోనే విద్యార్థి సంఘాల్లో కీలకపాత్ర పోషించిన సూదిని జైపాల్‌రెడ్డి 1969లో కల్వకుర్తి ఎమ్మెల్యేగా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు.. 2019 ఎంపీ ఎన్నికల సమయంలో పోటీ చేయని ఆయన కొన్ని ప్రాంతాల్లో ప్రచారానికి పరిమితమయ్యారు.. అప్పటి నుంచి జిల్లాకు రాని ఆయన మరణవార్త వినడంతో పాలమూరు జనం శోకసంద్రంలో మునిగిపోయారు.. తమ గడ్డ ఖ్యాతిని దేశ స్థాయిలో చాటిన ప్రియతమ నేతను కడసారి చూసేందుకు నాయకులు, కార్యకర్తలు హైదరాబాద్‌కు తరలివెళ్లారు.. 5 దశాబ్దాల జీవితంలో ఎన్ని ఒడుదొడుకులు ఎదుర్కొన్నా తాను నమ్మిన సిద్ధాంతాల విషయంలో రాజీపడని నేత జైపాల్‌రెడ్డి కన్నుమూత తీరని లోటు అని జిల్లావాసులు ఆవేదనకు గురయ్యారు. పాలమూరు నుంచి ఎంతోమంది ఉద్ధండులు రాజకీయాల్లో కీలకపాత్ర పోషించారు.. స్థానికులే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ గెలిచి తమదైన ముద్ర వేశారు.. ఎంతమంది నేతలు ఉన్నా మహబూబ్‌నగర్ అంటే ముందుగా గుర్చుకొచ్చేది జైపాల్‌రెడ్డియే. 50 సంవత్సరాల రాజకీయ జీవితంలో ఆయన జిల్లాపై అంతలా ముద్ర వేశారు. 1969లో కాంగ్రెస్ తరఫున పోటీ చేసి కల్వకుర్తి ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆయన రాజకీయ ప్రస్థానం ఎమ్మెల్యేగా, ఎంపీగా, కేంద్రమంత్రిగా స్ఫూర్తిదాయకంగా సాగింది. విలువలే ఆభరణంగా సాగిన ఆయన ఇందిరాగాంధీ అత్యవసర పరిస్థితిని వ్యతిరేకించి సొంత పార్టీ కాంగ్రెస్‌ను వీడారు. అనంతరం 1980లో మెదక్ నుంచి ఇందిరాగాంధీ బరిలోకి దిగగా ఆమెపై జనతాపార్టీ నుంచి పోటీ చేసి జాతీయ స్థాయిలో చర్చనీయాంశమయ్యారు.సుదీర్ఘ రాజకీయ జీవితంలో అవినీతి మకిలి అంటించుకోకుండా జైపాల్‌రెడ్డి అందరి మన్ననలు అందుకున్నారు. ఎమ్మెల్యేగా, ఎంపీగా, కేంద్రమంత్రిగా వ్యవహరించినా ఎక్కడా ఆరోపణలు ఎదుర్కొనలేదు. రాజకీయాలంటేనే ఆరోపణలు, ప్రత్యారోపణలు. ముక్కుసూటిగా మాట్లాడే ఆయన ఏనాడూ వ్యక్తిగత అంశాల జోలికి వెళ్లేవారు కాదు.. ఎవరితోనూ వ్యక్తిగత దూషణకు గురికాలేదు.

## కాగజ్‌నగర్ అడవుల్లో తొలగని భయం

### కవ్వాల్ అభయారణ్యంతో పులులకు రక్షణ

కాగజ్‌నగర్,జూలై29(ఆర్ఎన్ఎ): కవ్వాల్ అటవీప్రాంతం పెద్దపులులకు మంచి ఆవాస ప్రాంతంగా ఉందని, దట్టమైన అడవి, కావల్సిన జంతువులు ఉన్నాయని అందుకే పెద్దపులి బయటకు రాకుండా జంతువులను వేటాడుతూ లోపలే ఉంటోందని అటవీ అధికారులు అభిప్రాయపడ్డారు. కవ్వాల్ విస్తరణ తరవాత కాగజ్‌నగర్ మండలంలో పులి భయం ఇంకా తొలగలేదు. అడవిలోకి వెళ్లడానికి పశువులకాపర్లు భయపడతున్నారు. అప్పుడప్పుడూ భయం కారణంగా గ్రామస్తుల రక్షణకు ఏర్పాట్లు చేశామని, పశువులు, పంటల నష్టం జరిగితే ప్రభుత్వ పరంగా నష్టపరిహారాన్ని అందిస్తామని అధికారులు గ్రామస్తులకు తెలిపారు. అయినా భయం వీడడం లేదని అన్నారు. ఇదిలావుంటే కడెం మండలంలోని అటవీ ప్రాంతంలో పెద్దపులి తిరుగుతోందని గతంలోనే సీసీఎంబీ శాస్త్రవేత్తలు వెల్లడించారు. 20మంది శాస్త్రవేత్తలతో కూడిన బృందం కడెం రేంజీ పరిధిలోని పాండ్వాపూర్, గంగాపూర్ అడవుల్లో పర్యటించింది. కవ్వాల్ పెద్దపులుల సంరక్షణ కేంద్రం పరిధిలోని దట్టమైన అటవీప్రాంతంలో క్షుణ్ణంగా పరిశీలించారు. పశుపక్ష్యాదులు, అటవీ జంతువుల గోళ్లు, వెంట్రుకలు, చిన్నపాటి ఏ అవయం దొరికినా అది ఏ జంతువుది, దాన్ని ఏం తిని చంపిందో ఇట్టే తేల్చేస్తారు. ఏడాదిక్రితం ఈఅటవీప్రాంతంలో పెద్దపులి తిరిగిన విషయాన్ని, ఇపుడు తాజాగా లభించిన ఆనవాళ్లతో గుర్తించారు.

## తెలంగాణ సాకారం వెనక తెరవెనక సూత్రధారి

హైదరాబాద్, జులై 29:రాజకీయాల్లో అరుదైన వ్యక్తులు కొందరే ఉంటారు. వారు మాత్రమే రాజకీయాలను ప్రభావితం చేస్తుంటారు. వారుమాత్రమే ప్రజల సమస్యలపై చిత్తశుద్ధితో పనిచేస్తారు. వారు మాత్రమే తమ జీవితాంతం ప్రజాసేవకు కట్టుబడి పనిచేస్తారు. నిరంతరం ప్రజల కోసమే తమజీవితాన్ని పణంగా పెడతారు. అందుకోసం తపనపడతారు. తమ రాజకీయా అనుభవాన్ని ప్రజలకోసం ధారపోస్తారే తప్ప రాజకీయ వ్యాపారం చేయరు. ప్రజల సమస్యలను అడ్డం పెట్టుకుని లబ్దిపొందే ప్రయత్నం చేయలేరు. అలాగే ధనరాజకీయాలను దగ్గరకు రానీయరు. అలాంటి వారే చరిత్ర పుటల్లో నిలిచిపోతారు. అలాంటి అరుదైన వ్యక్తిత్వం తన ఆభరణంగా కలిగి, దానిని ప్రజలకు వదిలి తాను మాత్రం ఈ భువిని వదిలి వెళ్లిన ఉదాత్త రాజకీయవేత్త ఎస్.జైపాల్ రెడ్డి. నిరంతర శ్రామికుడిగా పేరు గడించడం వెనక ఆయన ఎంతో పట్టుదలతో పనిచేశారు. నిగర్విగా నిలవడం అన్నది కూడా బహు అరుదైన వ్యక్తిత్వంగా చూడాలి. రాజకీయాల్లో నిస్వార్థానికి అర్థం చెప్పిన నిఘంటువు ఆయన. తనకు ఉన్న అంగవైకల్యం తన రాజకీయ జీవితానికి అడ్డు రాదని, తన మనసుకు వైకల్యం లేదని నిరూపించుకున్న మహత్తర నేత ఆయన. వాగాడంబరంతో రాజకీయాల్లో రాణించే వారెందరో ...ప్రజల సమస్యలపై చిత్తశుద్ధి చాటి ఉండరు. ధనార్జన కోసం..పదవుల కోసం పాకులాడే మనస్తత్వం ఆయనది కాదు. జీవించినతం కాలం ఏ మేరకు ఎంత నిక్కచ్చిగా పనిచేశామన్నదీ ముఖ్యమే. అలా తెలంగాణ ఏర్పాటులో తెరవెనక మంత్రాంగం నడిపిన మహనీయుడు జైపాల్ రెడ్డి. ఉవ్వెత్తున సాగుతున్న తెలంగాణ ఉద్యమాన్ని దగ్గరగా చూసి, ఈ సమస్యను పరిష్కరించే క్రమంలో ఆనాటి యూపిఏ ఛైర్‌పర్సన్‌గా ఉన్న సోనియాకు సమస్యను వివరించి, ఆమెను ఒప్పించి మెప్పించి సమస్యకు పరిస్కారం చూపిన దార్శనికుడు జైపాల్ రెడ్డి. ఇవాళ ప్రత్యేక తెలంగాణ సాకారం అయ్యిందంటే ప్రజల పోరాటం ఎంత ఉందో అంతకు మించిన చాణక్యం జైపాల్‌రెడ్డి ప్రదర్శించారు. రాజకీయాల్లో తెరవెనక మంత్రాంగం చాలా ముఖ్యం. తెలంగాణ ఏర్పాటులో ఆయన పాత్ర ఎంత కీలకమో నేటి రాజకీయ నేతలకు తెలియనిది కాదు. ఆయన మంత్రాంగమే లేకుంటే...ఇవాళ తెలంగాణ సాకారం అయ్యేది కాదన్న విషయం తెలియంది కాదు. తెలంగాణ సాకారమయ్యేలా ఆయనచేసిన ప్రయత్నం విలువ ఇంతని చెప్పలేం. అలాంటి సమవర్తిత్వం ఆయనకు మాత్రమే సొంతం. అందుకే ఆయన మరణం ప్రత్యేకించి తెలంగాణ ప్రజలకు తీరనిలోటు. ఆయన రాజకీయాల్లో ఎంతగా ముద్ర వేసినా ఏనాడూ పదవుల కోసం పాటుపడని,రాజీలేని రాజకీయలకే ప్రాధన్యం ఇచ్చారు. ఎంతమేరకు ప్రజలతో మమేకం అయి వారి కోసం పాటుపడ్డారన్నదే ముఖ్యంగా జీవితాంతం పనిచేసిన అరుదైన రాజకీయవేత్త ఆయన. దగుల్బాజీ రాజకీయాలను చీల్చి చెండడమే గాకుండా వాటిని దూరంగా పెట్టిన జైపాల్ రెడ్డి తెలంగాణ బిడ్డగా పుట్టడం ఈ గడ్డ చేసుకున్న అదృష్టం. ఎంత వాక్పటిమా ఉన్నా అది కేవలం సమస్యను ప్రస్తావించడానికి మాత్రమే అన్న సిద్ధాంతం ఆయనది. ప్రజల సమస్యలను లోతుగా అధ్యయనం చేసినందు వల్లనే ఆయన తెలంగాణ ఉద్యమంలో తెరవెనక కీలకభూమిక పోషించారు. యూపిఏ ప్రభుత్వం తెలంగాణ ఏర్పటుకు ఒప్పుకునేలా చేశారు. జైపాల్‌రెడ్డి గొప్ప పండితుడే కాదు అంతకు మించిన మానవతావాది. పలు ప్రధానుల నేతృత్వాల్లోని ప్రభుత్వాల్లో సేవలందించిన ఘనత ఆయనది. పార్లమెంటు సభ్యుడిగా దాని గౌరవాన్ని పెంచారే తప్ప ఏనాడూ పదవికి తలవంపులు తేలేదు. పార్టీలకతీతంగా ఆయన్ను అందరూ అభిమానించడానికి, రాజకీయ విభేదాలు ఉన్నవారు సైతం ఆప్యాయత పెంచుకోవడానికి అదే కారణం. ఎల్లప్పుడూ ప్రజాప్రయోజనాల కోసం తపన పడ్డ రాజకీయ జీవితం ఆయనది. ఆయనో ప్రగతిశీల ప్రతిభాశాలిగా,తిరుగులేని వాక్పటిమతో రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి. తన మాటలతో చట్టసభలను ఆకట్టుకున్నా అదంతా ప్రజల సమస్యలను ప్రధానంగా ప్రస్తావించడమే లక్ష్యంగా ముందుకు సాగారు. బోఫోర్స్ గురించి మాట్లాడినా.. అయోధ్య గురించి వాదించినా విమర్శకులు సైతం మెచ్చుకోకుండా ఉన్నారంటే జైపాల్ రెడ్డి నిబద్ధతకి నిదర్శనంగా చెప్పుకోవాలి. ఇరవై ఆరేళ్ల వయసులోనే శాసనసభలో అడుగుపెట్టి.. నాలుగుసార్లు శాసనసభకు.. ఏడుసార్లు పార్లమెంటుకు ప్రాతినిధ్యం వహించిన ప్రజానేతగా, సుదీర్ఘ ప్రయాణంలో ఆయన అనేక విజయాలు సాధించారు. ప్రసారభారతి చట్టానికి పురుడుపోసి దూరదర్శన్ స్వయంప్రతిపత్తికి కృషిచేసిన దార్శనికుడు. లోక్‌సభ, రాజ్యసభ సమావేశాలను ప్రత్యక్షంగా చూస్తున్నామంటే అది ఆయన చొరవే. హైదరాబాద్- విజయవాడ ఆరులేన్ల రహదారికి అంకురార్పణ చేసిందీ ఆయనే. పట్టుదలే ఊతకర్రగా రాజకీయ వైకుంఠపాళిలో నిచ్చెనలెక్కుతూ అంచెలంచెలుగా ఎదిగిన పాలమూరు ముద్దుబిడ్డే అయినా అందరూ తమవాడనిపించుకునేలా జీవితాంతం కష్టపడ్డారు. అసెంబ్లీలో ఉన్న సమయంలో తనది, జైపాల్ రెడ్డిది ఒకే బెంచీ అని ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యానాయుడు గుర్తు చేసుకున్నారు. నిజానికి ఆనాడు ఇలాంటి వారివల్ల అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాలు గడగడలాడేవి. ప్రజావ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటే భయపడేవి. జైపాల్ రెడ్డి విపక్షంలో ఉన్నా, అధికారపక్షంలో ఉన్నా ఆయనది మాత్రం ప్రజాపక్షమే. దక్షిణ భారతదేశం నుంచి ఉత్తమ పార్లమెంటేరియన్‌గా గుర్తింపు తెచ్చుకున్న ఆయన మేధాశక్తి, విమర్శనాశైలి, విషయ పరిజ్ఞానం, భాషా ప్రావీణ్యం అద్భుతమని ఎవరైనా కొనియాడాల్సిందే. దేశ,జాతీయ, అంతర్జాతీయ రాజకీయ పరిణామాలు, ఆర్థిక, సామాజిక మార్పులపై చట్టసభల్లో ప్రస్తావించిన తీరు ఆయన చిత్తశుద్ధికి నిదర్శనం. బహిరంగ సవావేశాల్లో ఉపన్యసించినా తన ప్రత్యేకతను చాటుకునేవారన్నారు. శాసన సభ్యుడిగా, పార్లమెంటు సభ్యుడిగా, కేంద్ర మంత్రిగా రాజకీయాల్లో తనకంటూ ఓ స్థానాన్ని సంపాదించుకున్న జైపాల్ రెడ్డి ఆకస్మిక మృతి రాజకీయాలకు, తెలంగాణ వాసులకు తీరని లోటు.

## వైకల్యాన్ని మించిన పోరాటపటిమ

### రాజకీయాల్లో బహు అరుదైన వ్యక్తిత్వం
### తెలంగాణ ఏర్పాటులో అంకితభావంతో కృషి
### రాజకీయ దురంధరుడిగా జైపాల్ రెడ్డి చిరస్మరణీయుడు

హైదరాబాద్,జూలై29 (ఆంఎన్ఎ): తనకు అంగవైకల్యం ఉందన్న విషయాన్ని ఏనాడూ పట్టించుకోని రాజకీయ దురంధురుడు దివంగత జైపాల్‌రెడ్డి. ఆయన జీవితంలో ఎన్నో ఉత్థానపతనాలను చూసినా ధృడచిత్తంతో ముందుకు సాగిన రాజకీయవేత్త ఆయన. రాజకీయాల్లో కొత్త ఒరవడి సృష్టించిన జైపాల్ రెడ్డి పదవుల కోసం ఏనాడూ పాకలాడని అరుదైన వ్యక్తి. రాజకీయాల్లో ఏ మాత్రం అవకాశం ఉన్నా డబ్బు సంపాదించడానికే పాటుపడే వారికి జైపాల్ రెడ్డి జీఅవితం ఓ చెంపపెట్టులాంటి సందేశంగా కాగలదు. రాజకీయాల్లో నిబద్ధంగా ఉండాలంటే జైపాల్ రెడ్డి జీవితం చదవాల్సిందే. వైకల్యం తన మనసుకు లేదని నిరూపించుకోవడం కూడా బహు అరుదైన విసయంగా చూడాలి. ఇంగ్లిషులో ఆయన అనర్గళంగా మాట్లాడడం చూస్తుంటే దానికోసం ఆయన ఎంతగా పట్టుబట్టారో తెలుసుకోవాలి. ఇంగ్లిషు పండితులను సైతం అచ్చెరువొందేలా చేయగలిగే పాండిత్యం ఆయనది. రాజకీయ నాయకుడిగా అందరికీ ఆమోద యోగ్యుడు అనిపించుకునే అజాతశత్రుత్వం ఆయనకు మాత్రమే సొంతం. చట్టసభల్లో ఎలా నడుచుకోవాలనే విషయంలో ప్రజాప్రతినిధులకు ఆయన మార్గదర్శకుడనడంలో సందేహం లేదు. ఆయన చూపిన మార్గం నేటి యువతరం రాజకీయవేత్తలకు పాఠం కావాలి. 1998లో ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు అందుకున్నారు. అప్పటికి.. దక్షిణాది నుంచి ఈ ఘనత సాధించిన తొలి ఎంపీ ఆయనే. తన పోరాట పటిమ, వాక్చాతుర్యం, మేధాశక్తి ద్వారా అంచెలంచెలుగా ఎదిగిన జైపాల్‌రెడ్డి.. కేంద్రంలో ఎన్నో కమిటీలలో సభ్యుడిగా పనిచేశారు. తెలంగాణలోని ఓ మారుమూల ప్రాంతంలో జన్మించి.. విద్యార్థి దశనుంచే రాజకీయ లక్షణాలను పుణికిపుచ్చుకొని.. ఆత్మవిశ్వాసమే ఆలంబనగా అంచెలంచెలుగా ఎదిగి జాతీయ స్థాయి నాయకుడిగా వెలుగొందడం జైపాల్‌రెడ్డికి మాత్రమే సాధ్యం అయ్యింది. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని మాడ్గుల మండల కేంద్రంలో 1942 జనవరి 16న దుర్గారెడ్డి, యశోదమ్మ దంపతులకు తొలి సంతానంగా జైపాల్‌రెడ్డి జన్మించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎంఏ ఇంగ్లిష్ పట్టాపుచ్చుకున్నాక,. ఎంఏ పొలిటికల్ సైన్స్, జర్నలిజంలో డిగ్రీచేశారు. 1963-65లో ఓయూ విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా గెలుపొందారు. 1965-71 మధ్యకాలంలో ఉమ్మడి రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా, 1969 నుంచి 72 వరకు పీసీసీ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ఓయూలో రాజకీయజీవితానికి బీజం పడితే కల్వకుర్తి నుంచి తొలి ప్రస్థానం మొదలైంది. ఈ నియోజకవర్గం నుంచి తొలిసారి కాంగ్రెస్ అభ్యర్థిగా 1969లో, ఆ తర్వాత వరుసగా మూడుసార్లు గెలుపొందారు. 1969-84 మధ్యకాలంలో అసెంబ్లీలో తన వాణిని వినిపించారు. ఎమర్జెన్సీని వ్యతిరేకిస్తూ కాంగ్రెస్‌ను వీడి జనతా పార్టీలో చేరారు. 1980లో కేంద్ర రాజకీయాలపై దృష్టిసారించారు. 1980లో మెదక్ లోక్‌సభ స్థానం నుంచి ఇందిరా గాంధీపై పోటీ చేసి అందరి దృష్టిని ఆకర్షించారు. జనతాపార్టీ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 1984లో ఎంపీగా తొలిసారి మహబూబ్‌నగర్ లోక్‌సభ స్థానం నుంచి జనతా పార్టీ తరఫున గెలుపొందారు. 1998లో తిరిగి ఆ పార్టీ తరఫున.. అదే స్థానం నుంచి ఎంపీగా గెలుపొందారు. 1999లో తిరిగి కాంగ్రెస్ గూటికి చేరారు. 1999లో, 2004లో మిర్యాలగూడ నుంచి ఎంపీగా గెలిచారు. 2009లో కాంగ్రెస్ పార్టీ తరఫున చేవెళ్ల నుంచి విజయం సాధించారు. మొత్తంగా ఐదుసార్లు లోక్‌సభకు ఎన్నికైన ఆయన సభలో తన వాణిని సమర్థంగా వినిపించారు. 1990 నుంచి 1998 వరకు రెండు పర్యాయాలు రాజ్యసభ సభ్యుడిగా, రాజ్యసభలో విపక్ష నేతగా పనిచేశారు. వీపీసింగ్, ఐకే గుజ్రాల్, మన్మోహన్ కేబినెట్‌లో కేంద్ర సమాచార ప్రసారా శాఖ, కేంద్రపట్టణాభివృద్ధి శాఖ, పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రిగా సేవలందించారు. జాతీయ రాజకీయాల్లో తనదైన ముద్రవేసిన రాజ నీతిజ్ఞుడు, రాజకీయాలకు అతీతంగా అందరి స్నేహాన్ని చూరగొన్న అజాత శత్రువు, బహుభాషా కోవిదుడు, ఉత్తమ పార్లమెంటేరియన్‌గా కీర్తి గడించిన నేతగా పేరొందారు. దేశ రాజకీయ యవనికపై తనదైన ముద్రను చిరస్థాయిగా వేసిన రాజకీయ దురంధరుడాయన. తన అపార మేధస్సుతో, బహుభాషా పాండిత్యంతో జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పిన నాయకుడు. శారీరక వైకల్యాన్ని అధిగమించి.. మానసిక చైతన్యంతో జాతీయ రాజకీయాల్లో రాణించిన రాజనీతిజ్ఞుడుగా బహుఅరుదైన ప్రజ్ఞను సంపాదించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలకంగా వ్యవహరించిన జైపాల్‌రెడ్డి ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటులో భాగస్వాములు అయ్యారు.

## కరీంనగర్/వేములవాడ వార్తలు

## పార్కింగ్ షెడ్డులోకి దుసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

### ఆరు ద్విచక్రవాహనాలు ధ్వంసం
### ఖని ఆర్టీసీ డిపోలో ఘటన






కరీంనగర్, జులై 29 (నేటినిజం ప్రతినిధి): గోదావరిఖని ఆర్టీసీ డిపోలోని వాహనాల పార్కింగ్ స్టాండ్‌లోకి ఆదివారం ప్రమాదవశాత్తు ఓ బస్సు దూసుకెళ్లింది. దీంతో అందులో నిలిపి ఉంచిన ఆరు ద్విచక్రవాహనాలు ధ్వంసమయ్యాయి. ప్రమాద సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఆర్టీసీ బస్సును సర్వీసు చేసిన అనంతరం పార్కింగ్ చేస్తున్న క్రమంలో అద్దె ప్రాతిపాదికన బస్సులను పార్కింగ్ చేసే డ్రైవర్ నిర్లక్ష్యంతో ఈ ఘటన జరిగిందని అధికారులు తెలిపారు. కాగా ఈ ఘటనపై ఎలాంటి కేసు నమోదు కాలేదు.

## ఇద్దరు రైతులకు పాముకాటు

జగిత్యాల, జులై 29 (నేటినిజం ప్రతినిధి): జగిత్యాల జిల్లాలో ఆదివారం ఇద్దరు రైతులు పాముకాటుకు గురై ఆస్పత్రిలో చేరారు. మెట్‌పల్లి పట్టణానికి చెందిన పట్నం శేఖర్ అనే రైతు తన పొలంలో పనిచేస్తుండగా పాముకాటుకు గురయ్యారు. కొడిమ్యాల మండల కేంద్రానికి చెందిన లచ్చిరెడ్డి అనే రైతు తన చేనులో పని చేస్తుండగా పాముకాటు వేసింది. ఇద్దరిని వారి కుటుంబసభ్యులు 108 వాహనంలో జిల్లా కేంద్రలోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. లచ్చిరెడ్డిని కాటువేసిన పామును స్థానికులు చంపేశారు.

మేడిపల్లి మండలం వెంకట్రావుపేటకు చెందిన పెంకటి అంజయ్య (35) అనే యువ రైతు ఆదివారం సాయంత్రం పాముకాటుతో మృతి చెందాడు.

కుటుంబ సభ్యులు, గ్రామస్థుల కథనం ప్రకారం... అంజయ్య ఇటీవల గల్ఫ్ నుంచి స్వగ్రామానికి వచ్చి మళ్లీ వెళ్లేందుకు సిద్ధమయ్యాడు. ప్రస్తుతం వ్యవసాయం చేస్తుండగా ఆదివారం పొలానికి వెళ్లాడు. అక్కడ పాము కాటు వేయడంతో బంధువులు, గ్రామస్థులు జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు.

## శ్రీరాంసాగర్‌కు 380 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

జగిత్యాల జులై 29 (నేటినిజం ప్రతినిధి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఆదివారం వరకు 380 క్యూసెక్కుల వరదనీరు చేరినట్లు అధికారులు తెలిపారు. గోదావరి నదీ పరీవాహక ప్రాంతంలో తగిన వర్షాలు లేకపోవటంతో వరద పరిమితంగానే వస్తోంది. ప్రాజెక్టు గరిష్ఠ నీటినిల్వ సామర్థ్యం 90.313 టీఎంసీలకుగాను ప్రస్తుతం 5.458 టీఎంసీల నీరు నిలువుంది. ప్రాజెక్టు నుంచి ఔట్‌ఫ్లో 226 క్యూసెక్కులుగా ఉంది. ప్రాజెక్టు చరిత్రలోనే ఈ సీజన్‌లో అతితక్కువగా ఇప్పటి వరకు కేవలం 0.156 టీఎంసీల వరదనీరు మాత్రమే వచ్చిచేరింది. గతేడాది ఇదే సమయానికి 15.930 టీఎంసీల నీరు నిలువుంది.

# విత్తన పంటలపై రైతులకు ప్రోత్సాహం

## జిల్లాల వారిగా భూములను బట్టి పంటల ఎంపిక దిశానిర్దేశం చేస్తున్న వ్యవసాయశాఖ

హైదరాబాద్,జూలై29 (ఆంఎన్ఎ): ఇటీవలే విత్తన ఉత్పత్తిపై జరిగిన అంతర్జాతీయ సదస్సులో తెలంగాణలో విత్తన పంటలకు ఆసక్తి పెరిగింది. వ్యవసాయ శృాఖ కూడా విత్తన పంటలను ప్రోత్సహిస్తోంది. ప్రధానంగా వ్యవసాయ శాఖ కార్యదర్వఙ పార్థసారథి వివిధ జిల్లాల్లో పరిస్థితులను అడిగి తెలుసుకోవడం ద్వారా రైతులను విత్తన పంటలవైపు ప్రోత్సహిస్తున్నారు. ఈ మేరకు జిల్లా వ్యవసాయాధికారులు కూడా లాభాలు వచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. రాష్ట్రాన్ని విత్తన కేంద్రంగా మార్చుకోవడానికి సీఎం కేసీఆర్ పలు చర్యలు తీసుకొంటున్నారు. విత్తన ఉత్పత్తి విషయంలో తెలంగాణ జిల్లాలు అగ్రస్థానంలో నిలబడి ఎక్కువ మంది రైతులు విత్తన ఉత్పత్తిలో పాల్గొనేలా కార్యాచరణ చేస్తున్నారు. ఇందుకోసం రైతులకు అవగాహనకు చర్యలు తీసుకుంటున్నారు. పాశ్చాత్య దేశాల్లో యాంత్రికసాగు చేస్తూ తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు సాధిస్తున్నారు. యాంత్రిక సాగుపై దృష్టిసారించి అధిక లాభాలు వచ్చే కొత్త పద్ధతులు రూపొందించాలని పిలుపునిచ్చారు. పాలీహౌస్ సాగులక్ష్యం పెంచాలని నిర్ణయించారు. గత ప్రభుత్వాలు ప్రాజెక్టులు నిర్మించకపోవడంతోనే రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, ఆ పాపం వారిదేనన్నారు. దేశంలో తొలిసారిగా పాలీహౌస్ సాగును హర్యానాలో ప్రారంభించారని, ఏడాదికి 150 ఎకరాల్లో సాగు చేస్తే.. తెలంగాణలో రెండేండ్లలో వేయిఎకరాల్లో సాగైందని తెలిపారు. మెదక్,నిజామాబాద్ జిల్లాల్లో పాలీహౌస్ సాగుచేస్తూ బాగా సంపాదిస్తున్నారని చెప్పారు. దీంతో కూరగాయలు, పళ్లు పండించవచ్చిన అంటున్నారు. వ్యవసాయంలో బీజామృతం, జీవామృతం, ఘనజీవామృతం, నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం, అగ్నిఅస్త్రం, దశపర్ని కషాయం, సప్త దాన్యాంకుర కషాయం, ఆచ్చాదన, వాప్ప వంటి పద్ధతుల్లో ప్రకృతి వ్యవసాయం చేసుకోవచ్చన్నారు. ఈ పద్ధతిలో మామిడి, కొబ్బరి, చింత, శీతాఫలం, దానిమ్మ, ఆముదంతో పాటు పసుపు, చెరకు, మొక్కజొన్న, వరి పంటలను పండించవచ్చని తెలిపారు. ఇకపోతే నానాటికి అంతరించిపోతున్న ఆవులను సంరక్షించుకొంటే ఎన్నో లాభాలు ఉన్నాయని, ఒక్క ఆవు పేడ, మూత్రంతో దాదాపు 25 నుంచి 30 ఎకరాలను సాగుచేయవచ్చునని, దీంతో సాగుచేసిన పంటలు ఎంతో ఆరోగ్యాన్నిస్తాయని తెలిపారు. అంతర పంటల ద్వారా వచ్చే లాభంతో ప్రధాన పంట ఖర్చులు తీరిపోతాయి. ప్రధాన పంట నుంచి వచ్చే సంపాదన అదనపు సంపాదన అవుతుంది. ఏక పంటలు సాగుచేయకుండా మిశ్రమ పంటలను సాగుచేస్తే కనీసం 20 రకాల పంటలు వేసుకొవచ్చు. కంపెనీలు పక్క రాష్ట్రాలకు తరలిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇప్పటికే వ్యవసాయమంత్రి పలు సందర్భాల్లో దీనిపై కార్యాచరణ ప్రకటించారు. పలు కంపెనీలు కూడా ప్రభుత్వ ఉద్దేశాలకు అనుగుణంగా పనిచేయడానికి ముందుకు వచ్చాయి. ప్రస్తుతం విత్తన ఉత్పత్తికి రైతులతో ఒప్పందాలకు కంపెనీల ప్రతినిధులు సుముఖత వ్యక్తం చేశారు. వరి, మొక్కజొన్నకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తారు. మరికొంత విస్తీర్ణంలోనూ పంటలు వేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. రైతులు లాభాలు ఆర్జించేందుకు ప్రోత్సాహం అందించాలని విత్తన కంపెనీలకు ఇటీవల మంత్రి పోచారం సూచించారు. విత్తన ఉత్పత్తి చేసే రైతులు అధిక లాభాలను ఆర్జించేలా వారిని ప్రోత్సహించాల్సిన అవసరముందని అన్నారు. రాష్ట్రాన్ని విత్తన కేంద్రంగా మార్చాలన్న లక్ష్యంతో సీఎం అనేక చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు ఇటీవల విత్తన కంపెనీల ప్రతినిధులు ఇటీవలి సదస్సులో సమావేశమయి చర్చించారు. దీనికితోడు ఇంజినీరింగ్ విద్యారులు యాంత్రికసాగుపై దృష్టిసారించి అధిక లాభాలు వచ్చేలా కొత్త పద్ధతులు రూపొందించాలని దిశానిర్దేశం చేశారు.

# మూడెకరాల హామీని విస్మరించారు

ఖమ్మం,జూలై29(ఆర్ఎన్ఎ): దళితులకు మూడెరెకాల భూమి పంపిణీ చేస్తానన్న ముఖ్యమంత్రి మాట తప్పారని సీపీఎం నాయకులు విమర్శించారు. దళితులు, గిరిజనుల ఆత్మగౌరవాన్ని తెలంగాణ ప్రభుత్వం దెబ్బ తీస్తోందని అన్నారు. కార్పొరేట్ శక్తులకు ఎర్ర తివాచీ పరుస్తున్న తెరాస ప్రభుత్వం అణగారిన వర్గాల బాగును పూర్తిగా మరిచిందని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో బడుగు జీవుల అభ్యున్నతే ధ్యేయంగా ముందుకు సాగుతామని అన్నారు.

కులాలు, మతాలు, వర్గాల ప్రాతిపదికన కాకుండా జనాభా ప్రాతిపదికన తెలంగాణలో సామాజిక న్యాయం అందజేయాలని డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్ గిరిజనులపై అక్రమ కేసులు బనాయించి అడవులనుంచి వారిని దూరం చేయాలని ప్రయత్నిస్తున్నారని అన్నారు. భద్రాద్రి జిల్లా దుమ్ముగుడెం వద్ద గోదావరికి లిఫ్ట్ ఏర్పాటుచేసి అక్కడి భూములకు నీరివ్వాలని డిమాండ్ చేశారు.

# థియేటర్లలో మళ్లీ యధావిధిగా ధరల మోత?

భద్రాది కొత్తగూడెం,జూలై29(ఆర్ఎన్ఎ): వినోదం కోసం వెళ్లిన ప్రేక్షకులపై సినిమా థియేటర్లలో తినుబండారాలు,కూల్ డ్రింక్స్, ఇతర ఆహార పదార్థాలకు సంబంధించి ఏది కొన్నప్పటికీ అధిక రేట్లకు విక్రయిస్తూ ప్రేక్షకులపై మోపుతూనే ఉన్నారు. కొద్దిరోజులు హడావిడి చేసిన అధికారుల ఆ తరవత పట్టించుకోవడం మానేశారు. దీంతో థియేటర్లలో మళ్లీ యధావిధిగా అధికధరలకు అమ్ముతూనే ఉన్నారు.

కుటుంబంతో సినిమాకు వెళ్లిన వారికి సినిమా థియేటర్లలోని క్యాంటీన్లలో ఏమైనా తినుబండారాలు, కూల్‌డ్రింక్స్, వాటర్ బ్యాటిల్స్, ఇతరత్రా స్నాక్స్‌కొంటే ఎంఆర్‌పీ ధరల కంటే అధికంగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు రావడంతో అధికారులు తనిఖీలు చేసి హెచ్చరికలు జారీ చేశారు. కచ్చితమైన నిబంధనలను అమలు చేస్తూ అన్ని సినిమా థియేటర్ల యజమానులతో జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక సమావేశాలు నిర్వహించి సూచనలు చేశారు.

జిల్లా వ్యాప్తంగా అన్ని సినిమా థియేటర్ల యజమానులు, నిర్వాహకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి హెచ్చరించారు. అయితే అది ఎంతోకాలం నిలవలేదు. మళ్లీ యధావిధిగా ధరలు మోతమోగిస్తూనే ఉన్నాయి.

## సంగారెడ్డి వార్తలు

# ఘనంగా బోనాల పండుగ

సంగారెడ్డి, జులై 29 (నేటినిజం ప్రతినిధి):మండల పరిధిలో ఆదివారం బోనాల ఉత్సవాలను భక్తులు ఘనంగా జరుపుకున్నారు. పటేల్‌గూడ, కిష్టారెడ్డిపేట, వడక్‌పల్లి, జానకంపేట, గండిగూడ, సుల్తాన్‌పూర్ గ్రామాల్లో బోనాల ఊరేగింపు అంగరంగ వైభవంగా సాగింది. అమీన్‌పూర్ ఎంపీపీ దేవానందం కిష్టారెడ్డిపేటలోని పోచమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. సర్పంచి కృష్ణ దంపతులు, నాయకులు తులసీరెడ్డి, జ్ఞానేశ్వర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

గుమ్మడిదల: గుమ్మడిదల మండలంలోని గ్రామాల్లో బోనాల సంబరాలు అంబరాన్నంటాయి. బొంతపల్లిలో పోచమ్మ తల్లికి మహిళలు బోనాలతోపాటు మొక్కులు చెల్లించారు. పోతురాజు విన్యాసాలతో సందడిగా మారింది. ఎడ్ల బండ్లను అందంగా అలంకరించి ఆలయం చుట్టూ తిప్పి సందడి చేశారు. ఎంపీపీ సద్ది ప్రవీణ, సర్పంచి ఆలేటి నవీన, ఎంపీటీసీ సభ్యుడు సురభి నాగేందర్‌గౌడ్ వీరభద్రస్వామి ఆలయ కమిటీ ఛైర్మన్ ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి, భాజపా రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గిద్దెరాజు, నాయకులు సద్ది విజయభాస్కర్‌రెడ్డి, గౌరీశంకర్‌గౌడ్, గటాటి రమేశ్, వినోద్‌గౌడ్, చక్రపాణి, గోపాల్, శంకర్, మల్లేష్ అమ్మవారిని దర్శించుకున్నారు. నల్లవల్లిలో పోచమ్మ తల్లికి బోనాలను సమర్పించడానికి మహిళలు తరలివచ్చారు. వీరన్నగూడెంలో సర్పంచి మమత, ఉపసర్పంచి కుమార్, నాయకులు వేణు, లక్ష్మీనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. రాంరెడ్డిబాయిలో సర్పంచి వాసవి, ఉప సర్పంచి ప్రవళిక బోనాలు సమర్పించారు. నాయకులు దామోదర్‌రెడ్డి, పద్మారెడ్డి, అంజిరెడ్డి పాల్గొన్నారు.

జిన్నారం మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయాల వద్ద ప్రత్యేక సందడి నెలకొంది. ఘటాల ఊరేగింపు, బోనాలతో మహిళలు అమ్మవారి ఆలయాలకు వెళ్లి నైవేద్యాలు సమర్పించారు. పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలతో ప్రత్యేక సందడి నెలకొంది. జిన్నారం, మాదారం, కిష్టాయపల్లి, అల్లీనగర్, ఊట్ల, శివానగర్, లక్ష్మీపతిగూడెంలలో బోనాల వేడుకను నిర్వహించారు. లక్ష్మీపతిగూడెంలో జడ్పీ ఉపాధ్యక్షుడు ప్రభాకర్, మాజీ ఎంపీపీ నిర్మల, తెరాస నాయకుడు వెంకటేశంగౌడ్, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు అమ్మవారి ఆలయంలో పూజలు చేశారు.

ఐడీఏ బొల్లారంలోడీఏ బొల్లారం పురపాలిక సంఘం పరిధిలో ఆదివారం బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మాజీ జడ్పీటీసీ బాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రవీందర్‌రెడ్డి, తెరాస రాష్ట్ర నాయకుడు చంద్రారెడ్డి, నాయకులు హనుమంతరెడ్డి, వరప్రసాద్‌రెడ్డి, యాదిరెడ్డి, అనిల్‌రెడ్డిల ఆధ్వర్యంలో బోనాల పండుగను నిర్వహించారు.

పటాన్‌చెరు రామచంద్రాపురంలో కన్నుల పండువగా బోనాలు నిర్వహించారు. శ్రీనివాసనగర్‌కాలనీ, పాత రామచంద్రాపురం, మయూరినగర్, కానుకుంట దేవాలయాల్లో నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో ఎమ్మెల్సీ భూపాల్‌రెడ్డి, గ్రేటర్ స్టాడింగ్ కమిటీ సభ్యులు, కార్పొరేటర్లు అంజయ్యయాదవ్, సింధూఆదర్శరెడ్డిలు అమ్మవార్లను దర్శించుకున్నారు. కార్యక్రమంలో తెరాస రామచంద్రాపురం పట్టణ అధ్యక్షుడు పరమేష్‌యాదవ్, తెరాస సమన్వయకర్త కృష్ణకాంత్, వార్డు సభ్యులు మోహన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, మహిపాల్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, జగన్నాథరెడ్డి పాల్గొన్నారు.



# మార్కెట్లలో దోపిడీ పట్టని పాలకవర్గాలు

## మద్దతు ధరల నష్టానికి తోడు రకరకాల మోసాలు అధికార పార్టీ నేతల పరోక్ష సహకారం

హైదరాబాద్,జూలై29(ఆర్ఎన్ఎ): రైతుల సంక్షేమమే ధ్యేయమని కొలువుదీరిన మార్కెట్ పాలకవర్గాలు వారి కళ్లెదుటే రైతులు దగాకు గురవుతున్నా పట్టించుకోవటం లేదు. ప్రధానంగా రైతులు గిట్టుబాటు ధరలు దక్కక నష్టపోతున్న తీరు ఒక ఎత్తయితే, మార్కెట్లో వివిధ రకాలుగా దోపిడీకి గురవుతున్నారు. ఇది తెలుగు రాష్ట్రాల్లో కళ్లకు కనపడే సత్యం. ఈ-నామ్ ప్రవేశ పెట్టినా దోపిడి తగ్గలేదు. కోనుగోలుదారులతో ఉన్న సాన్నిహిత్యంతో పాలకవర్గాలు కూడా నోరుమెదపటం లేదు. అసలు రైతులకు ఈ నిబంధన ఉందన్న అవగాహన కూడా లేదు. అవగాహన కల్పించాల్సిన, నిబంధనను అమలు చేయాల్సిన అధికారులు బాధ్యతను విస్మరిసున్నారు. పాలకవర్గాలు కూడా పట్టించుకోకపోవటం శోచనీయం. ప్రభుత్వం రైతుల మేలు కోసం చేసిన నిబంధనను కచ్చితంగా అమలు చేసేలా మార్కెటు అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. మార్కెటింగ్ అధికారులు కూడా చ్ూనే చ్ూడ్నట్లు వ్యవహరిస్తున్నారు.

కమీషన్ ఏజంట్లు దడవాయి ఛార్జీలను రైతులతోనే కట్టించుకంటూ నిలువు దోపిడీ చేసన్తున్నారు. యథేచ్ఛగా దడవాయి దోపిడీ జరుగుతుంటే రైతులు ఏటా కోట్లల్లో నష్టపోతున్నారు. వ్యవసాయ మార్కెట్‌కు రైతు తెచ్చిన ధాన్యాన్ని కమీషన్ ఏజంటు ద్వారా వ్యాపారులు కోనుగోలు చేస్తుంటారు. టెండరు పద్ధతిలో ధాన్యం కొనుగోలు చేశాక బస్తా తూకం వేయటం కోసం దడవాయిలకు ఇచ్చే ఛార్జీలు కొనుగోలుదారులే చెల్లించేలా ఉత్తర్వులు ఉన్నాయి. వ్యవసాయ మార్కెట్లలో అధికారులు ఈ నిబంధనను పట్టించుకోవడం లేదు. ప్రతి బస్తా తూకం వేసినందుకు రైతుకు ఇచ్చే సొమ్ములో కోత విధించి దడవాయిలకు ఇస్తున్నారు. ఇదేమని అడిగిన రైతులకు అసలు తక్‌పట్టే ఇవ్వకుండా తెల్లకాగితం మీద రాసి చేతిలో పెట్టి పంపిస్తున్నారు. కొనుగోలుదారులే దడవాయి ఛార్జీలు చెల్లించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినా అమలు కావడం లేదు. వాటిని అమలు చేయకుండా వ్యాపార వర్గాలకు కొమ్ము కాస్తున్నారు. ఫలితంగా రెక్కల కష్టమైన పంటను అమ్ముకునేందుకు వచ్చిన అన్నదాతలే దడవాయి ఛార్జీలు చెల్లించాల్సి వస్తోంది. ప్రతి రోజు ఒక్కో మార్కెట్ యార్డుకు సీజన్‌లో వేలాది బస్తాల్లో వివిధ రకాల ధాన్యం ఉత్పత్తులు వస్తుంటాయి. వ్యాపారులే దడవాయి ఛార్జీలు చెల్లించాలన్న నిబంధన ఉన్నా దాన్ని అమలుచేయక పోవటంతో రైతులు నష్టపోతున్నారు. దడవాయి ఛార్జీలు వ్యాపారులే చెల్లించాలన్న నిబంధన ఉంది. అన్ని మార్కెట్లలో ఈ నిబంధన అమలు కావటం లేదు. ఇప్పటికీ రైతుల నుంచే దడవాయి ఛార్జీలను వసూలు చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వసూలు చేయటంపై రైతులు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని మార్కెటింగ్ అధికారులు చెప్పి తప్పించుకుంటున్నారు. రైతుల నుంచి దడవాయి ఛార్జీలు వసూలు చేయరాదని నిబంధన ఉన్నా కొనుగోలుదారులు, కమీషన్ దారులు, అధికారులు కుమ్మక్కై అమలు చేయటం లేదు. రైతుల నుంచి అక్రమంగా వసూలు చేయటంపై తెలంగాణ రైతాంగ సమితి తరఫున ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. అవసరమైతే దీనిపై కోర్టును ఆశ్రయించి నిబంధనలు అమలు చేసేలా కృషిచేస్తామని తెలంగాణ రైతాంగ సమితి నేతలు అన్నారు. ఎమ్మెల్యేలను మార్కెట్ కమిటీ గౌరవాధ్యక్షులుగ ఆనియమిస్తే సమస్యలు నేరుగా తెలుస్తుందని ఏపి సిఎం వైఎస్ జగన్ నిర్ణియించారు. ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. అయితే రైతులు మోసానికి గురికాకుండా చర్య తీసుకోవాల్సి ఉంది.

# జైపాల్‌రెడ్డి కన్నుమూత



హైదరాబాద్, జూలై 29: ప్రముఖ పార్లమెంటేరియన్, తెలంగాణ బిడ్డ, కేంద్ర మాజీ మంత్రి ఎస్ జైపాల్ రెడ్డి కన్నుమూశారు. సోమవారం తెల్లవారుజామున ఇక్కడ గచ్చిబౌలీలోని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ జైపాల్ రెడ్డి మరణించారు. ఆయన వయస్సు 77 సంవత్సరాలు.

కొంత కాలంగా న్యూమోనియా తదితర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన ఈ నెల 20 నుంచి చికిత్స పొందుతున్నారు. ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఆయన మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. జైపాల్ రెడ్డి భౌతిక కాయానికి సోమవారం నగరంలోని నెక్లెస్‌రోడ్డులో పీవీ ఘాట్ పక్కన కేటాయించిన స్థలంలో అంత్యక్రియలు జరుగుతాయని సమన్వయ కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ గుత్తా సుఖేందర్ రెడ్డి చెప్పారు. (

పభుత్వ లాంచనాలతో అధికారికంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించారని.. సోమవారం మధ్యాహ్నం ఒంటి గంటలకు అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. మహబూబ్‌నగర్ జిల్లా మాడుగులలో 1942 జనవరి 16వ తేదీన ఒక సంపన్న రైతుకుటుంబంలో జైపాల్ రెడ్డి జన్మించారు. ఆయన తల్లితండ్రులు సూదిని దుర్గారెడ్డి, యశోదమ్మ. నల్లగొండ జిల్లా దేవరకొండలో ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తి చేశారు. ఉస్మానియావిశ్వవిద్యాలయం నుంచి ఎంఏ డిగ్రీలో పట్టా పొందారు. ఎమర్జనీ విధింపునకు వ్యతిరేకంగా అంతవరకు కాంగ్రెస్‌లో ఉన్న జైపాల్ రెడ్డి ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి జనతా పార్టీలో చేరారు. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రులు బ్రహ్మానందరెడ్డి, కోట్ల విజయభాస్కర రెడ్డి ఆధ్వర్యంలో ఆయన రాజకీయ ప్రస్తానం ప్రారంభమైంది. 1969లో తొలిసారిగా మహబూబ్‌నగర్ జిల్లా కల్వకుర్తి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా జైపాల్ రెడ్డి గెలిచారు. నాలుగు సార్లు అదే నియోజకవర్గం నుంచి ఆయన ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. జనతాపార్టీ ఎమ్మెల్యేగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభలో అద్భుతంగా రాణించారు. ఆయన ప్రసంగాలు వినేందుకు ప్రజలు చెవులు కోసుకునే వారు.

1984లో మహబూబ్‌నగర్ లోక్‌సభ స్థానం నుంచి జనతా పార్టీ నుంచి ఎంపీగా గెలిచారు. 1999, 2004లో మిర్యాలగూడ నుంచి ఎంపీగా గెలిచారు. 1990, 1996లో రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. 1991 జూన్ నుంచి 1992 వరకు రాజ్య సభ పక్ష నేతగా వ్యవహరించారు. 199 నుంచి 2000 వరకు సభా హక్కుల ఉల్లంఘన కమిటీ చైర్మన్‌గా పనిచేశారు. ఐకే గుజ్రాల్ కేబినెట్‌లో కేంద్ర సమాచార శాఖ మంత్రిగా పనిచేశారు. 2004లో యూపీఏ ప్రభుత్వ హయాంలో పెట్రోలియం, పట్టణాభివృద్ధి, సాంస్కృతిక శాఖ మంత్రిగా పనిచేశారు. 1998లో ఉత్తమ పార్లమెంటేరియన్‌గా పురస్కారం అందుకున్నారు. దక్షిణాది నుంచి తొలిసారి ఉత్తమ పార్లమెంటేరియన్‌గా పురస్కారం అందుకున్న నేతగా జైపాల్ రెడ్డిగా గుర్తింపు పొందారు.

సీనియర్ కాంగ్రెస్ నేత, పార్లమెంటేరియన్ జైపాల్ రెడ్డి మరణం పట్ల రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధాని నరేంద్ర మోదీ, మాజీ ప్రదాని మన్మోహన్ సింగ్, ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యానాయుడు, రాష్ట్ర గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ సంతాపం ప్రకటించారు. ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యానాయుడు మాట్లాడుతూ జైపాల్ రెడ్డి తాను అసెంబ్లీలో ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేలుగా పనిచేసిన రోజులను గుర్తు చేసుకున్నారు. జైపాల్ రెడ్డి అద్భుతమైన వక్త, ప్రజా సమస్యలపై రాజీలేకుండా చట్టసభల్లో, వెలుపల పోరాడారన్నారు. అసెంబ్లీలో ప్రతిపక్షస్థానంలో ఒకే బెంచీలో రెండు సార్లు కూర్చున్నామని గుర్తు చేసుకున్నారు. జూబ్లీహిల్స్‌లోని జైపాల్ రెడ్డి గృహానికి ముఖ్యమంత్రి కేసీఆర్ వెళ్లి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు.

## ప్రజాసమస్యలపై పోరాడిన నేత: జగన్

అమరావతి: జైపాల్‌రెడ్డి మృతి పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. శాసనసభ్యునిగా, పార్లమెంట్ సభ్యుడిగా జైపాల్‌రెడ్డి మంచి వక్తగా గుర్తింపు పొందారని ప్రస్తుతించారు. ప్రజాసమస్యలపై ఆయన చట్టసభల్లో నిరంతరం గళమెత్తేవారని గుర్తుచేశారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

# 14 మంది 'రెబెల్స్'పై అనర్హత వేటు



బెంగళూరు, జూలై 29: కర్నాటకలో 14 మంది రెబెల్ ఎమ్మెల్యేలపై అసెంబ్లీ స్పీకర్ కేఆర్ రమేష్ కుమార్ ఆదివారంనాడు అనర్హత వేటు వేశారు. సోమవారంనాడు ముఖ్యమంత్రి బీఎస్ యడియూరప్ప అసెంబ్లీలో మెజారిటీ నిరూపించుకునే తరుణంలో స్పీకర్ రెబెల్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేస్తూ అసాధారణ నిర్ణయం తీసుకున్నారు. దీంతో వీరంతా ఫిరాయింపు వ్యతిరేక చట్టం కింద ప్రస్తుత శాసనసభ కాలపరిమితి పూర్తయ్యేవరకు అంటే 2023 దాకా ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లేదు. అనర్హత వేటు పడినవారిలో 11 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ముగ్గురు జేడీఎస్ ఎమ్మెల్యేలు ఉన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్-జేడీఎస్ సంకీర్ణ ప్రభుత్వం కుప్పకూలిన నేపథ్యంలో నూతన ముఖ్యమంత్రిగా యడియూరప్ప బాధ్యతలు స్వీకరించిన రెండు రోజుల తర్వాత రెబెల్ ఎమ్మెల్యేలపై తాను తీసుకోబోయే అసాధారణ నిర్ణయం గురించి స్పీకర్ మీడియా సమావేశంలో వెల్లడించారు. అయితే, రెబెల్ ఎమ్మెల్యేలపై స్పీకర్ అనర్హత వేటు విధించినా ప్రస్తుతం యడియూరప్ప ప్రభుత్వంపై ఎలాంటి ప్రభావం చూపదు. రెబెల్ ఎమ్మెల్యేలు లేకపోయినా శాసనసభలో సంఖ్యాబలం తగ్గినా సోమవారంనాడు శాసనసభలో యడియూరప్ప బలనిరూపణకు ఎలాంటి నష్టం వాటిల్లే ఆస్కారం లేదు. 17 మంది రెబెల్ ఎమ్మెల్యేలపై స్పీకర్ అనర్హత వేటు వేయడంతో ప్రస్తుతం శాసనసభలో స్పీకర్ మినహాయిస్తే మొత్తం 224 మంది సభ్యుల్లో 207 మందే ఉంటారు. కొత్త ప్రభుత్వం బలనిరూపణకు మ్యాజిక్ ఫిగర్ 104 ఉండాలి. అయితే, యడియూరప్ప నాయకత్వంలోని బీజేపీకి ఒక ఇండిపెండెంట్ ఎమ్మెల్యేతో కలుపుకుని 106 మంది బలం ఉంది. ఇక అసెంబ్లీలో కాంగ్రెస్‌కు నామినేటెడ్ సభ్యుడితో కలిపి 66 మంది ఎమ్మెల్యేలు, జేడీఎస్‌కు ఒక బీఎస్పీ సభ్యుడితో కలిపి 34 మంది ఎమ్మెల్యేల బలం ఉంది. కుమారస్వామి ప్రభుత్వానికి జరిగిన విశ్వాస తీర్మానంలో ఓటు వేయని బీఎస్పీ ఎమ్మెల్యేను ఆ పార్టీ నుంచి సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే.

ఇదిలావుండగా, 'నా మనస్సాక్షి చెప్పిన విధంగా నూటికి నూరు శాతం న్యాయబద్ధంగా వ్యవహరించాను' అని స్పీకర్ రమేష్ కుమార్ 14 మంది రెబెల్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసిన తర్వాత జరిగిన మీడియా సమావేశంలో పేర్కొన్నారు. కుమారస్వామి నాయకత్వంలోని సంకీర్ణ ప్రభుత్వంపై జరిగిన విశ్వాస తీర్మానంలో పాల్గొనకుండా, తమ పదవులకు రాజీనామా చేసిన 14 మంది కాంగ్రెస్, జేడీఎస్ ఎమ్మెల్యేలు పిటిషన్లు దాఖలు చేసిన నేపథ్యంలో అందుకు అనుగుణంగానే తాను వారిపై అనర్హత వేటు వేశానని స్పీకర్ రమేష్ కుమార్ స్పష్టం చేశారు. అదేవిధంగా తమపై అనర్హత వేటు, రాజీనామాల వ్యవహారంలో తుది నిర్ణయం తీసుకునేందుకు నాలుగు వారాల పాటు గడువు ఇవ్వాలని రెబెల్ ఎమ్మెల్యేలు చేసిన అభ్యర్థనను తాను తోసిపుచ్చినట్టు స్పీకర్ తెలిపారు.

## మెజారిటీ నిరూపించుకుంటా: యడియూరప్ప

కర్నాటక అసెంబ్లీలో సోమవారంనాడు జరిగే విశ్వాస తీర్మానంలో మెజారిటీ నిరూపించుకుంటానని ముఖ్యమంత్రి బీఎస్ యడియూరప్ప ధీమా వ్యక్తం చేశారు. ఆదివారంనాడు ఇక్కడ మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడుతూ 'సోమవారంనాడు జరిగే విశ్వాస తీర్మానంలో నూటికి నూరు శాతం మెజారిటీ నిరూపించుకుంటా' అని ఆయన వ్యాఖ్యానించారు. అదేవిధంగా కాంగ్రెస్, జేడీఎస్ నాయకత్వంలోని గత సంకీర్ణ ప్రభుత్వం రూపొందించిన ఆర్థిక బిల్లులో ఎలాంటి మార్పులు, చేర్పులు లేకుండానే సోమవారంనాడు అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. ఆర్థిక బిల్లును 'అత్యవసరంగా' శాసనసభలో ఆమోదించాల్సి ఉంటుందని, లేకుంటే ఉద్యోగులకు జీతాలు చెల్లించేందుకు కూడా నిధులు విడుదల చేయలేని పరిస్థితి ఎదురవుతుందని సీఎం అభిప్రాయపడ్డారు. 'సోమవారంనాడు తమ ప్రభుత్వంపై విశ్వాస పరీక్ష తర్వాత తొలుత ఆర్థిక బిల్లును పరిగణనలోకి తీసుకుంటాం' అని ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వం రూపొందించిన ఆర్థిక బిల్లును ఎలాంటి మార్పులు లేకుండా యథాతథంగా అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్నామని ఆయన మరోసారి స్పష్టం చేశారు.

## ఏపీ వార్తలు

# ప్రజలకు 'పవర్'ఫుల్!



అమరావతి, జూలై 29: విద్యుత్ రంగమే చోదకశక్తిగా రాష్ట్ర అభివృద్ధికి నాంది పలుకుతామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఉద్ఘాటించారు. ప్రజలు సాధికారత సాధించేందుకు దోహదపడే ఈ రంగాన్ని బలోపేతం చేస్తామన్నారు. విద్యుత్ రంగం ద్వారా ప్రజల్ని 'పవర్'ఫుల్!గా తీర్చిదిద్దటమే తమ లక్ష్యమన్నారు. విద్యుత్ రంగ సంస్కరణలతో ప్రతి ఒక్కరికీ ప్రయోజనం కలుగుతుందన్నారు. నవరత్నాల్లో భాగంగా విద్యుత్ రంగాన్ని సమర్థంగా అమలు చేసేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. ఈ రంగంలో మూడు పథకాల ద్వారా 40లక్షల మందికి లబ్ధి చేకూరుతుందని వివరించారు. ఇది జాతీయ స్థాయి రికార్డుగా రాష్ట్ర ఇంధన వనరులు, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి తెలిపారు. రైతుల సంక్షేమానికి అవసరమైన కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. ఆదివారం ఈవిషయమై విద్యుత్ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. వ్యవసాయానికి పగటిపూట 9గంటల ఉచిత విద్యుత్, ఆక్వా రైతులకు తక్కువ ధరకే సరఫరా చేసే ప్రతిష్టాత్మక పథకాలను తమ ప్రభుత్వం ఏర్పాటైన రెండు నెలల్లోనే అమల్లోకి తెచ్చామన్నారు. భారీ సబ్సిడీతో వ్యవసాయంగానికి 9గంటల ఉచిత విద్యుత్ పథకాన్ని ఏ రాష్ట్రమూ అమలు చేయటంలేదని తెలిపారు. ఈ ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందని, రైతుల శ్రేయస్సే ధ్యేయంగా కార్యక్రమాలు చేపట్టాం న్నారు. రైతులకు ఉచిత విద్యుత్ అందించటంలో దేశానికే వైఎస్ చాంపియన్‌గా నిలిచారని ప్రస్తుతించారు. ఈ రంగంలో ప్రతిష్టాత్మకమైన మూడు పథకాలను సమర్థంగా అమలు చేసేందుకు డివిజన్, జిల్లా, డిస్కంల స్థాయిలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని మంత్రి బాలినేని అధికారులకు సూచించారు. ఈ పథకాల అమలు నూరు శాతం విజయవంతం కావాలని నిర్దేశించారు. వ్యవసాయ, సాంఘిక సంక్షేమ, మత్స్య శాఖలతో సమన్వయం చేసుకుని ఎలాంటి అవరోధాలు లేకుండా పథకాలను పటిష్టంగా అమలు చేయాలన్నారు. 'క్షేత్రస్థాయి నుంచి అభివృద్ధి పనులు చేపట్టటం ద్వారా రాష్ట్రాన్ని ప్రగతిపథంలో ఎలా నడిపించవచ్చునేది అవగతమవుతుంది. విద్యుత్ రంగాన్ని బలోపేతం చేయడం ద్వారా ప్రజలు సాధికారత సాధిస్తారు. ఈవిషయంలో ఏ చర్యలు చేపట్టినా అది ప్రజాప్రయోజనాల కోసమే. ప్రజల సంతృప్తే నా సంతృప్తి. పగటిపూట 9గంటల ఉచిత విద్యుత్ అందించేందుకు అంకితభావంతో పనిచేస్తున్నాం. సంక్షోభంలో ఉన్న ఆక్వా రైతులను ఆదుకునేందుకు తక్కువ ధరకే విద్యుత్ సరఫరా చేయాలని సంకల్పించాం. ఇలాంటి చర్యలు గ్రామీణాభివృద్ధికి ఎంతగానో దోహదపడతాయి' అని ముఖ్యమంత్రి జగన్ స్పష్టం చేశారని మంత్రి బాలినేని వివరించారు.

రాష్ట్రం మొత్తంగా 18.15 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరేలా 9గంటల ఉచిత విద్యుత్ కోసం ప్రభుత్వం రూ. 4525 కోట్లు కేటాయించిందని మంత్రి బాలినేని తెలిపారు. ఉచిత విద్యుత్ వల్ల సాగు విస్తీర్ణం, దిగుబడులు పెరుగుతాయని, తద్వారా రైతులు సాధికారత సాధించే వీలు కలుగుతుందని చెప్పారు. ప్రస్తుతం యూనిట్ రూ. 3.85కు విద్యుత్ సరఫరా పొందుతున్న ఆక్వా రైతులకు ఇకపై యూనిట్ రూ. 1.50కే అందిస్తామని, దీనివల్ల 53వేల 469 కుటుంబాలు లబ్ధి పొందతాయన్నారు. రాష్ట్రంలో తొలిసారి ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించేందుకు రంగం సిద్ధమైందని వెల్లడించారు. దీనివల్ల ప్రభుత్వంపై రూ. 128కోట్ల భారం పడుతుందని, ఈ పథకానికి రూ. 413కోట్లు ఖర్చవుతుందని తెలిపారు. రాష్ట్రంలోని కొత్త ఎస్సీ, ఎస్టీ కాలనీలకు కూడా ఈ పథకాన్ని వర్తింపజేస్తామని ప్రకటించారు.

విద్యుత్ రంగంలో నవరత్నాలు అమలు చేయటం ద్వారా 40లక్షల కుటుంబాలు లబ్ధి పొందాలనేదే ప్రభుత్వ లక్ష్యమని ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి నాగులాపల్లి శ్రీకాంత్ తెలిపారు. ఇప్పటికే కోటీ 80లక్షల మంది వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందిస్తుట్లు చెప్పారు. ప్రభుత్వ నిర్ణయాలకు అనుగుణంగా విద్యుత్ రంగంలో ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలిస్తున్నట్లు చెప్పారు. దీనిపై ప్రత్యేకించి ఓ నివేదిక రూపొందిస్తున్నామన్నారు. దీనివల్ల జవాబుదారీతనం, బాధ్యత పెరుగుతాయని, పథకాల అమలులో లోటుపాట్లు సరిదిద్దుకునే వీలు కలుగుతుందన్నారు. విద్యుత్ రంగాన్ని నవరత్నాల అమలులో రోల్‌మోడల్‌గా నిలిపేందుకు అధికారులు కృషి చేయాలని మంత్రి బాలినేని కోరారు. ఈ రంగంలో సమస్యలు పరిష్కరించేందుకు ప్రతినెలా మూడో శుక్రవారాన్ని గ్రీవెన్స్‌డేగా నిర్వహిస్తున్నామని ఏపీ ట్రాన్స్‌కో జేఎండీ కేవీఎన్ చక్రధరబాబు తెలిపారు. ప్రధాన కేంద్రాల్లో పనిచేస్తున్న అన్ని కేడర్ల ఉద్యోగులు, క్షేత్రస్థాయి అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నామని, దీనివల్ల విద్యుత్ రంగంలో ప్రజాహిత కార్యకలాపాలపై సిబ్బంది ప్రత్యేక దృష్టి కేంద్రీకరించే అవకాశాలు ఉంటాయని వివరించారు. టెలీకాన్ఫరెన్స్‌లో ట్రాన్స్‌కో జేఎండీ ఉమాపతి, డిస్కంల సీఎండీలు నాగలక్ష్మి సెల్వరాజన్, హెచ్ హర్‌నాథరావు, నెడ్‌క్యాప్ వీసీ, ఎండీ రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### పాలనకూడా చేతకాని..

# కేసీఆర్ చేతుల్లో పెడతారా?

**- ఇలాంటి అసమర్థులు ఒక్క ఛాన్స్ ఎందుకోసం అడిగారు?**
**- మీ స్నేహాలకు, సొంత లాలూచీలకు..**
**- రాష్ట్ర ఆస్తులను ధారాదత్తం చేస్తామంటే సహించేది లేదు**
**- జగన్‌పై ట్విట్టర్‌లో చంద్రబాబు, లోకేష్ ధ్వజం**

అమరావతి, జులై29(ఆర్ఎన్ఎ) : తెలుగు రాష్ట్రాల్లో బందరు పోర్ట్ వ్యవహారం మళ్లీ తెరపైకి వచ్చింది. బందరు పోర్ట్‌ను తెలంగాణకు అప్పగిస్తారంటూ మళ్లీ ప్రచారం మొదలయ్యింది. తెర వెనుక పోర్ట్‌ను తెలంగాణకు అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నాయంటూ టీడీపీ ఆరోపిస్తోంది. వైసీపీ ప్రభుత్వాన్ని టా÷-గ్గ్÷ట్ చేస్తూ ఏపీ ప్రతిపక్ష నేత, టీడీపీ అధినేత చంద్రబాబు.. మాజీ మంత్రి లోకేష్‌లు ట్వీట్లు చేయడం మళ్లీ ఆసక్తిగా మారింది. లోకేష్ తన ట్వీట్‌లో కీలక వ్యాఖ్యలు చేశారు. ఈరోజు చేతకాక బందరు పోర్టును తెలంగాణకు అప్పగిస్తామంటున్నారు. రేపు పాలన కూడా చేతకావట్లేదని రాష్ట్రాన్ని కేసీఆర్ చేతుల్లో పెడతారా? ఇలాంటి అసమర్థులు ఒక్క ఛాన్స్ ఎందుకోసం అడిగారు? దోచుకోడానికా? ప్రజల భవిష్యత్తును పక్క రాష్ట్రాలకు తాకట్టుపెట్టడానికా?'అంటూ ఓ పత్రికలో వచ్చిన కథనాన్ని ప్రస్తావిస్తూ నిలదీశారు. మరోవైపు వైసీపీ ప్రభుత్వం బందరు పోర్టును తెలంగాణకు అప్పగించే ప్రయత్నం చేస్తోందని టీడీపీ అధినేత, ప్రతిపక్ష నేత చంద్రబాబు ట్విట్టర్ వేదికగా ధ్వజమెత్తారు. జూన్ 28న ఆర్టీ-62 నంబర్‌తో రహస్య జీవోగా జారీ చేసి.. రెండు రోజుల్లో 'జారీ చేయబడలేదు' అని మార్చారని చంద్రబాబు పేర్కొన్నారు. తెలంగాణకు బందరు పోర్టు ఇస్తున్నారా అని అసెంబ్లీలో ప్రశ్నిస్తే.. అలాంటిదేమీ లేదని బుకాయించారని చంద్రబాబు పేర్కొన్నారు. కానీ పోర్టును తెలంగాణకు అప్పగించేందుకు తెరవెనుక ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. సీమాంధ్రకు పోర్టులు ప్రకృతి ఇచ్చిన వరమని ట్విట్టర్‌లో పేర్కొన్నారు. ఇలాంటి పోర్టులపై సొంత నిర్ణయాలు తీసుకునే అధికారం ఎవరికీ లేదన్నారు. మీ స్నేహాలకు, సొంత లాలూచీలకు.. రాష్ట్ర ఆస్తులను ధారాదత్తం చేస్తామంటే సహించేది లేదని ట్విట్టర్‌లో చంద్రబాబు పేర్కొన్నారు.

# నీరు-చెట్టులో 500కోట్ల అవినీతి

### జిల్లాలో అవినీతిపై ఆరా తీస్తున్న విజిలెన్స్

గుంటూరు,జూలై29(ఆర్ఎన్ఎ): జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన నీరు- చెట్టు పథకం పనుల నిగ్గుతేల్చేందుకు విజిలెన్స్ రంగంలోకి దిగింది. ముఖ్యమంత్రి జగన్ ఆధ్వర్యంలో క్యాబినెట్ సబ్ కమిటీ గతంలో జరిగిన పనులను తిరగదోడుతోంది. దీనిలో భాగంగానే నీరు - చెట్టు పేరుతో అప్పట్లో జరిగిన పనులపై దర్యాప్తు చేయాలని ప్రభుత్వం విజిలెన్స్ అధికారులను ఆదేశించింది. 2014 - 15 నుంచి 2018 - 19 వరకు జిల్లాలో సుమారు రూ.500 కోట్ల వరకు నీరు - చెట్టు పనులు జరిగినట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు విజిలెన్స్ అధికారులు ఇటీవల జిల్లా నీటి యాజమాన్య సంస్థ కార్యాలయానికి వెళ్లారు. విజిలెన్స్‌లోని పోలీస్, ఇంజనీరిగ్ అధికారులు డ్వామాలో నీరు - చెట్టు పనుల రికార్డులు ఇవ్వాలని కోరారు. మరో వైపు జలవనరుల శాఖ, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారుల నుంచి కూడా చేసిన పనుల వివరాలను సేకరించారు. ప్రధానంగా ఆయా శాఖలు ఇచ్చిన బిల్లులు, చెక్కుల ఆధారంగా ఆ డబ్బు ఎవరి ఖాతాలో జమయిందో పరిశీలిస్తున్నారు. మొత్తం మీద నీరు - చెట్టుపై విజిలెన్స్ రంగంలోకి దిగడంతో బినామీల పేరుతో పనులు చేసిన షాడోలు బెంబేలెత్తుతున్నారు. ప్రధానంగా భూగర్భ జల వనరులు ఇంకిపోతున్నాయని, నీటి నిల్వలు పెంచాలంటే చెరువులు, కుంటలు, చెక్ డ్యామ్‌లు, పంట కాల్వల మరమ్మతులు చేపట్టాలని గత ప్రభుత్వం ఆదేశించింది. వాటితో పాటు పెద్ద ఎత్తున చెట్లు నాటాలని సూచించింది. రెండింటినీ సమన్వయ పరిచి నీరు - చెట్టు పేరుతో పథకాన్ని ప్రవేశపెట్టింది. జలవనరుల శాఖ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా), పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖల ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీల్లో పెద్ద ఎత్తున చెరువులను తవ్వారు. నిబంధనలకు తిలోదకాలిచ్చి అందినకాడికి తవ్వేశారన్న ఆరోపణలు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో చెరువులు, కుంటల్లో పూడిక పేరుకుపోయి నీరు నిల్వ ఉండటం లేదని, పూడిక తీస్తే ఆ ప్రాంతంలో భూగర్భ జలవనరులు పెరుగుతాయని అప్పట్లో అంచనాలు వేయించారు. క్షేత్ర స్థాయిలో స్థానిక సంస్థలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, నీటి సంఘం అధ్యక్షులు, సహకార సంఘాల నేతలు, ఇతర అధికార పార్టీ నాయకులు నీరు - చెట్టులో పెద్ద ఎత్తున నిధులు స్వాహా చేసినట్లు అప్పట్లో ఆరోపణలు వెల్లువెత్తాయి. చెరువులు, కుంటలు, కాల్వలు బాగు చేసిన వారికి జలవనరులు, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్, డ్వామాల ద్వారా బిల్లులు చెల్లించారు. ఆయా ప్రాంతాల్లో బినామీ పేర్లతో చేసిన పనుల బిల్లులపై విజిలెన్స్ అధికారులు దృష్టి సారించారు. కొన్ని గ్రామాలు, మండలాల్లో జడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తమ అనుచరుల పేర్లతో వర్క్ ఆర్డర్లు పొందినట్లు తెలుస్తోంది. బినామీగా ఉన్న అనుచరుల పేరుతో ప్రభుత్వం చెక్కులు ఇచ్చింది. బినామీల చెక్కులు బ్యాంక్ నుంచి ఆర్టీజీఎస్ ద్వారా షాడోల ఖాతాలకు జమ అయినట్లు వినవస్తోంది.

### ఎల్సీయూఎల్-56 నౌకను ప్రారంభించిన నేవీ

విశాఖపట్టణం,జూలై29(ఆర్ఎన్ఎ): భారత నౌకాదళ అమ్ములపొదిలో మరో నౌక చేరింది. విశాఖ నావెల్ డాక్ యార్డు నుంచి నౌకాదళ సేవల్లోకి నౌక ప్రవేశించింది. ఎల్సీయూఎల్-56 నౌకను తూర్పు నౌకాదళ అధిపతి వైస్ అడ్మిరల్ ఏకే జైన్ ప్రారంభించారు. ఐఎన్ ఎల్సీయూఎల్-56 పోర్టు బ్లెయిర్ కమాండ్‌లో సేవలు అందించనుంది. తీర ప్రాంత భద్రత దిశగా ఐఎన్ ఎల్సీయూఎల్-56 పని చేయనుంది. జవాన్లు, యుద్ధ ట్యాంక్‌లను ఒక చోటు నుంచి మరో చోటికి చేర్చడంలో సేవలు అందించనుంది.

# తమలపాకు రైతులకు ఆషాఢం దెబ్బ

### ఆ తరవాత ముహూర్తాల వేటు అమ్మకాలు లేక ఆందోళన

అనంతపురం,జూలై 29(ఆర్ఎన్ఎ): ఆషాఢ మాసం ఆకుతోట రైతులపై పంజా విసురుతోంది. లాభాల బాటలోని తోటలు నష్టాల్లోకి కూరుకుపోయాయి. సాధారణంగా ఏడాదిలో ఆషాఢ మాసం నెలరోజులు మాత్రమే వ్యాపారాలు తగ్గేవి. ఈసారి మూడునెలల పాటు శుభ దినాలు లేకపోవడంతో ఆకుతోటల రైతులు కుదేలవుతున్నారు. దీని ప్రభావంతో ఆకుతోటల రైతులకు భారీ నష్టం మిగిల్చనుంది. ఒక్కొక్క రైతుకు ఎకరాకు రూ.4 లక్షల నష్టం వాటిల్లనుంది. ఇప్పట్లో ధర వచ్చే అవకాశం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. పూజలు, పెళ్లిళ్లు, శుభకార్యాలు ఏవైనా వాటికి తమలపాకులు తప్పనిసరిగా కావాల్సిందే. ఇంతటి ప్రాధాన్యమున్న తమలపాకులకు న ధర లేక సాగుచేసిన రైతులు నష్టాలు చవిచూడాల్సి వస్తోంది. మూడు నెలలపాటు శుభదినాలు లేకపోవడమేనని రైతులు, వ్యాపారులు చెబుతున్నారు. సాధారణంగా ఆషాఢంలో వ్యాపారాలు తగ్గేవని, ఈ ఏడాది మూడు మాసాలు శుభదినాలు లేకపోవడంతో ఈ ప్రభావం మరింత ఎక్కువగా ఉందని వారు తెలిపారు. మండలంలోని రాయలచెరువు, పెద్దపేట గ్రామాలతోపాటు మండల సరిహద్దు గ్రామమైన కిష్టిపాడు, కదరగుట్టపల్లి గ్రామాల్లో తమలపాకు తోటలు పెద్దఎత్తున సాగుచేస్తారు. ఏటా శ్రావణమాసం నుంచి సీజన్ ప్రారంభమవుతుంది. అప్పటి నుంచి ఆకుల కనీస ధర లభిస్తుందని రైతులు తెలిపారు. ఇక్కడ పండించే తమలపాకులను బళ్లారి, హుబ్లీ, బెంగళూరు, చెన్నై వంటి ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు. స్థానికంగా కూడా తమలపాకుల విక్రయాలు కొనసాగిస్తుంటారు. పెళ్లిళ్లు, పూజలు ఉన్నప్పుడు నట్టల ఆకులు కొనుగోలు చేస్తుంటారు. వేలకు వేలు ఖర్చుపెట్టి పంట సాగుచేస్తే ధరలు లేక నష్టాలు చవిచూడాల్సి వస్తోంది. ఈ ఏడాది ఆషాఢం, మూఢం మూడునెలలు ఉండడంతో ధరలపై ప్రభావం బాగా చూపుతోంది.

# సేంద్రియ వ్యవసాయానికి ప్రోత్సాహం

విజయవాడ,జూలై29(ఆర్ఎన్ఎ): వ్యవసాయ రంగంలో ప్రభుత్వం సేంద్రియ విధానం ద్వారా సాగును ప్రోత్సహిస్తోంది. దిగుబడి పెంచేందుకు రైతులు రసాయనిక ఎరువుల వినియోగాన్ని పెంచుకుంటూ పోతుండడంతో పరిస్థితి మరింత దిగజారి పోవడమే కాకుండా రైతులపై ఆర్థిక భారం పడుతుంది. ఏటా పెరుగుతున్న పెట్టుబడుల నుంచి ఉపశమనం కలిగించే ఈ విధానం భూమి సారవంతం కావడానికీ ఉపయోగపడుతుండడంతో అన్నదాతలు ఆసక్తి చూపుతున్నారు. దీంతో గొర్రెలు, మేకలు, ఆవులు, గేదెలు పెంచేవారికి ఈ విధానం చక్కటి ఆదాయ మార్గంగా నిలుస్తోంది. పశువుల విసర్జితాలను నిల్వ చేయడంతో పాటు నేరుగా జీవాలను రెండు, మూడు రోజులు పొలంలో ఉంచడం ద్వారా నిస్సారవైన పొలం తిరిగి జీవం పోసుకుంటుంది. భూసారం తగ్గిపోవడంతో పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఈ నేపథ్యంలో జీవాల విసర్జితాలతో ఈ లోపాన్ని సంప్రదాయ విధానం ద్వారా భర్తీ చేయవచ్చు. జీవాల విసర్జితాలు పంటలకు ఉపయోగపడే సూక్ష్మపోషకాలు ఉండడంతో భూసారం పెరుగుతుంది. తేమను పట్టుకొనే శక్తి పెరుగుతుంది. జీవాలను రెండు, మూడు రోజులు ఒక పొలంలో రాత్రి పూట ఉంచినందుకు గాను రైతుల నుంచి డబ్బులు తీసుకుంటారు. గతంలో కంటే ఇటీవల కాలంలో ఈ విధానంపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. ప్రజలకు సేంద్రియ ఎరువులను పొలంలో ఉపయోగించాలని, మంచి దిగుబడుతు వస్తాయని గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నట్లు వ్యవసాధికారులు తెలిపారు. సేంద్రియ ఎరువులు వాడడం వల్ల పంట నాణ్యమైన దిగుబడి వస్తుందన్నారు.

# పూడుకుపోయిన పంట బోదెలు

కాకినాడ,జూలై29(ఆర్ఎన్ఎ): ప్రధాన పంట కాల్వలోని నీరు బోదెల ద్వారా పొలాల్లోకి వెళ్తుంది. ఆయా నీటిని అన్నదాతలు కావాల్సిన పరిమాణంలో ఒడిసి పట్టుకొని సాగు చేసు కొంటారు. జిల్లాలో తొలకరి సాగు బోదెల ఆధారంగానే కొనసాగుతుంది. ఇంతటి ప్రాధాన్యం ఉన్న బోదెలు రైతుల పాలిట శాపంగా మారాయి. జిల్లాలో బోదెలన్నీ తూటు, డెక్కతో పేరుకుని పోయాయి. ప్రధాన పంట కాల్వల నుంచి వస్తున్న నీరు సరిగా బోదెలకు అందడం లేదు. దీంతో తొలకరి నారుమడులు ఎండిపోతున్నాయి. జిల్లాలో సుమారుగా 11 ప్రధాన పంట కాల్వలుండగా, వాటికి అనుసంధానంగా మూడు వేల దాకా పంట బోదెలు ఉన్నాయి. గోదావరిలో నీటి మట్టం బాగా ఉన్నా సరే బోదెల వ్యవస్థ సక్రమంగా లేకపోవడం వల్ల నీరు సరిగా అందడం లేదు. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇటువంటి పరిస్థితి ఉంటే ఉపాధి హామీ నిధులతో బోదెలను శుభ్రం చేసేవారు. తాజాగా అటువంటి నిబంధనలు రాకపోవడంతో డెక్క తీసేవారే కరువయ్యారు. దీంతో అక్కడక్కడ రైతులే స్వచ్ఛందంగా డెక్క తీసుకొంటున్నారు.

## వరంగల్ రూరల్ వార్తలు

# షీటీమ్స్‌కు ధీటుగా మహిళా కమిటీలు

### సత్ఫలితాలు ఇస్తున్న పోలీసుల నిర్ణయం

వరంగల్,జూలై29(నేటినిజం ప్రతినిధి): సమాజంలో ఆడవారి పై జరుగుతున్న అఘాయిత్యాలకు, ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా వరంగల్ పోలీసులు తీసుకున్న నిర్ణయం సత్ఫలితం ఇస్తోంది. తెలంగాణ రాష్ట్రంలో ఆడవారికి ఆత్మరక్షణ కరువైందని గ్రహించిన ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా షీ టీమ్స్‌ను ఏర్పాటు చేసింది. తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా షీ టీమ్స్ ద్వారా స్వశక్తి కార్యక్రమాన్ని తలపెట్టి ఆడవారు తమ ఆత్మరక్షణను ఎలా కాపాడుకోవాలో నేర్పుతూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. దాని కోసం వరంగల్ కమిషనరేట్ పరిధిలో ప్రత్యేకంగా ఒక టీంను ఏర్పాటు చేసి మెళకువలు నేర్పించారు. చారిత్రక నేపథ్యం కలిగిన ఓరుగల్లులో ఒక్కొక్కరిని ఒక్కో రుద్రమ దేవిగా తయారు చేయడమే లక్ష్యంగా స్వశక్తి కార్యక్రమాన్ని పెట్టి నూతన ఒరవడి సృష్టిస్తున్నారు. రోడ్డు భద్రత విషయంలో ఎన్నో కార్యక్రమాలు చేయడంతో పాటు డ్రైవర్ల ఆరోగ్యం కోసం సామాజిక సేవా కార్యక్రమాలు చేసి తనదైన ముద్రను వేసుకున్నారు. ఇదే రీతిలో ఆడవారికి మరింత ఆత్మస్థైర్యం నింపేలా వారి ఆత్మరక్షణ వారి చేతిలోనే ఉందని నిరూపించే విధంగా స్వశక్తి కార్యక్రమాన్ని రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ప్రవేశపెట్టారు. దీనిని ఇంతటితోనే వదిలేయ వద్దనే లక్ష్యంతో వరంగల్ కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న మహిళా పోలీసులతో కలిసి ఒక స్వశక్తి టీంను ఏర్పాటు చేశారు. వారికి మార్షల్ ఆర్ట్స్, ఆడవారిపై ఆకతాయిలు వెంటపడితే తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు ఎదిరించే సెల్ఫ్ డిఫెన్స్ స్కిల్స్, 12 రకాల ఆత్మరక్షణ టెక్నిక్స్‌ను పూర్తి స్థాయిలో శిక్షణ ఇప్పించారు. ఆడపిల్లల ఆత్మరక్షణకు, వారికి ఎలాంటి విషయంలోను వేదింపులు ఉండొద్దు అనే భావనతో గురుకుల సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో ఉండే విద్యార్థినిలకు స్వశక్తి ద్వారా మెళకువలు నేర్పించారు. స్వశక్తి షీ టీం ద్వారా సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్స్‌లో శిక్షణ ఇచ్చారు. ఆకతాయిలు ఎదురైనపుడు ముఖం, మెడ, ఛాతి, పొట్ట లాంటి భాగాలలో ఎలా దాడి చేయాలో, దాడి చేసిన వారిని ఎలా ఎదుర్కోవాలో చేసి చూపించారు. ఎలాంటి ప్రమాదానికి భయపడకుండా ముందుకు వెళ్లాలని అప్పుడే మనం అనుకున్నది సాధించ వచ్చు అనే సంకల్పంతో ప్రతి అమ్మాయి ముందుకు అడుగు వేయాలని ఆకాంక్షించారు. భవిష్యత్తు సవ్యంగా ఉండాలని కోరుకోవడమే కాకుండా ఎలాంటి ఆపద ఉన్న పోలీసులం మేమున్నామని చెపుతూ వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపడానికి ఇలాంటి శిక్షణ ఏర్పాటు చేసినట్లు పోలీసులు వివరించారు. ఇప్పుడా కార్యక్రమాలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. చారిత్రక నగరంలో ఇప్పుడు షీ టీమ్స్ బాగా పనిచేస్తున్నాయి.

# రూ.200 కోట్లతో పట్టణ అభివృద్ధి పనులు

### -ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

వరంగల్,జూలై29(నేటినిజం ప్రతినిధి): నర్సంపేటను రూ.200 కోట్లతో ఆదర్శ (మోడల్) పట్టణంగా తీర్చిదిద్దేందుకు త్రికరణ శుద్ధిగా కృషి చేస్తూ అభివృద్ధి విజన్‌తో ముందుకు సాగుతున్నట్లు ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తెలిపారు. నర్సంపేట పురపాలక సంఘం సమావేశ మందిరంలో ఆదివారం విలేకరుల సమావేశంలో అందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. పట్టణ అభివృద్ధి కోసం నిధులు తీసుకొచ్చినట్లు తెలిపారు. ఇప్పటికే కొన్ని పనులు నడుస్తున్నాయని, మరికొన్ని ముగింపు దశలో ఉండగా కొన్ని టెండర్లు పూర్తయ్యాయన్నారు. ఇంకొన్ని పనులు ప్రారంభమయ్యాయని మొత్తం పనులు ఏడాదిలోగా పూర్తి చేసి నర్సంపేటను మోడల్ సిటీగా తీర్చిదిద్దే బాధ్యత తనదేనని ఆయన హామీనిచ్చారు. రెండు పడక గదుల ఇళ్లను రూ.50 కోట్లతో 960 ఇళ్లను నిర్మిస్తున్నామని.. ఇందుకు సంబంధించిన టెండర్ ప్రక్రియ పూర్తయిందన్నారు. పాకాల రోడ్డులో మినీ పట్టణంగా తీర్చిదిద్దబోతున్నట్లు చెప్పారు. 250 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని.. ఉద్యోగుల ప్యాటరన్ కోసం ఎదురు చూస్తున్నామని.. అవి కాగానే శంకుస్థాపన చేస్తామన్నారు. రూ.32 కోట్లతో పట్టణంలో మిషన్ భగీరథ పథకంలో ఇంట్రా పనులు చేపడుతామని పేర్కొన్నారు. నెక్కొండ రోడ్డులో ఆహార శుద్ధి పరిశ్రమ ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయని.. భూసేకరణ జరుపుతున్నట్లు చెప్పారు. పట్టణంలో 30 కిలో మీటర్ల నిడివితో పక్కా రోడ్ల వేయాల్సి ఉందని, వీటిలో 20 కి.మీ. సీసీతో, పది కిలో మీటర్లు తారుతో నిర్మిస్తున్నామని, పనులు ప్రారంభమయ్యాయని వివరించారు. రూ.3 కోట్లతో జీహెచ్ఎంసీ తరహాలో కుమ్మరికుంట ఉద్యానవనం, రూ.5 కోట్లతో ఆడిటోరియం, రూ.5 కోట్లతో పట్టణంలో విద్యుద్దీకరణ పనులు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. అధునాతన వసతులతో గ్రంథాలయ భవనం, సిద్దిపేట, గజ్వేల్ మాదిరిగా కూరగాయల మార్కెట్ అభివృద్ధి, అండర్ డ్రైనేజీ పనులు చేయనున్నట్లు స్పష్టం చేశారు. అనంతరం ఆదర్శ పట్టణ చిత్రాలతో కూడిన కరపత్రాలను (బ్రోచర్ల)ను ఆవిష్కరించారు. సమావేశంలో పురపాలక మాజీ ఛైర్మన్ వెంకటనారాయణ, నాయకులు విద్యాసాగర్‌రెడ్డి, రవీందర్‌రెడి,?డ శ్రీనివాస్, రమాదేవి, రామారావు, నర్సయ్య, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# సకాలంలో జీతాలు చెల్లించాలి

### పారిశుద్య కార్మికుల వినతి

చిత్తూరు,జూలై 28(ఆర్ఎన్ఎ): గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న తమకు పెండింగ్ జీతాలు విడుదల చేయాలని పారిశుధ్య కార్మికులు డిమాండ్ చేశారు. పంచాయతీల్లోని పారిశుధ్య కార్మికుల సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. చెత్తను ఎరువును మార్చడంలో తమ పాత్ర కీలకమన్నారు. దీనివల్ల పంచాయతీలకు ఆదాయం వస్తోందన్నారు. అటువంటిది తమకు తొమ్మిది నెలలుగా వేతనాలను విడుదల చేయలేదని నాయకులు తెలిపారు. అలాగే వలంటీర్ వ్యవస్థలో తమను భాగస్వామ్యం చేయాలని రేషన్ డీలర్లు డిమాండ్ చేశారు. రేషన్ డీలర్ల సంఘ జిల్లా అధ్యక్షుడు ఎం.ఎల్. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. కార్డుదారుడి ఇంటి వద్దకే రేషన్ సరుకులను వలంటీర్ ద్వారా చేరుస్తామని ప్రభుత్వం చెప్పడంతో తమ ఉనికి ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఇకనైనా తమ సమస్యను అర్థం చేసుకుని, పరిష్కరించాలని కోరారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గ్రామ సచివాలయ పోస్టుల్లో దివ్యాంగులకు రిజర్వేషన్ కల్పించాలని ఏపీ నిరుద్యోగ వికలాంగ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ కోరారు. విద్య, ఉద్యోగ రంగాల్లో ఐదు శాతం దివ్యాంగులకు రిజర్వేషన్లు కల్పించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలన్నారు.

ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేస్తే ఉద్యమిస్తామని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు హెచ్చరించారు. పేదలు వలసలు వెళ్లకుండా ఈ పథకంతో కడుపు నింపుకుంటున్నారని చెప్పారు. దేశంలోని 256 జిల్లాల్లో వర్షాభావ పరిస్థితులు ఉన్నాయని ప్రకటించిన కేంద్రం.. అక్కడ ఉపాధి పథకం ప్రయోజనాన్ని గుర్తించకపోవడం దారుణమన్నారు. ఇకనైనా ఈ పథకాన్ని రద్దు చేయకుండా చూడాలని డిమాండ్ చేశారు.

# రాళ్లదాడిలో వాచ్‌మెన్ హత్య

విజయనగరం,జూలై29(ఆర్ఎన్ఎ): వాచ్‌మాన్‌పై రాళ్లతో దాడి చేసి దుండగులు హత్య చేసిన ఘటన సోమవారం విజయనగరం పట్టణం నడిబడ్డున ఉన్న స్థానిక అయోధ్య మైదానంలో చోటు చేసుకుంది. దుండగులు అయోధ్య మైదానంలో వాచ్‌మాన్ గా పని చేస్తున్న జరజాపు పెంటయ్య పై రాళ్లతో దాడి చేసి హత్య చేశారు. అయోధ్య మైదానం ఆఫీస్ కార్యాలయంలో పెంటయ్య రక్తపు మడుగులో పడి ఉన్నాడు. వెంటనే ఘటనా స్థలానికి పోలీసులు చేరుకున్నారు. రెండవ పట్టణ సిఐ శ్రీ హరి రాజు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## వరంగల్ అర్బన్ వార్తలు



# వరంగల్ జిల్లాలో విస్తారంగా వర్షాలు

వరంగల్, జూలై 29: గత రెండు రోజులుగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం ఉదయం నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. వరంగల్ నగరంతో పాటు జయశంకర్ భూపాలపల్లిజిల్లా, ములుగు జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు కురుస్తుండడంతో జలకళ సంతరించుకుంది. భారీ వర్షాల కారణంగా గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఓపెన్ కాస్ట్ గనుల్లో భారీ వర్షాల వల్ల బొగ్గు ఉత్పత్తి తీవ్ర ఆటంకం ఏర్పడింది. ఓపెన్ కాస్ట్‌లోకి వర్షపు నీరు చేరడంతో యంత్రాలు నడిచే పరిస్థితి లేక బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. మంగపేట మండలం మల్లూరు-మొట్లగూడెం-నర్సింగాపూర్ మధ్య ఉన్న మల్లూరు వాగు డైవర్షన్ రోడ్డుకు గండిపడడంతో శనగకుంట, నర్సింహాసాగర్, గాంధీనగర్, నరేంద్రరావుపేట, పూరేడుపల్లి ఐదు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వాజేడు మండలంలో బొగత జలపాతం ఆకట్టుకుంటుంది. వెంకటాపురం నూగూరు చెరువు భారీ నీరు చేరడంతో చెరువు నిండింది. దీంతో ఏ క్షణానైనా చెరువుకు గండి పడే అవకాశాలు ఉన్నాయని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ములుగు జిల్లా లక్నవరం చెరువు నీటి మట్టం 19 అడుగులకు చేరింది. జంపన్న వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది.

ఎటూరునాగారం వద్ద గోదావరి నీటి మట్టం క్రమక్రమంగా పెరుగుతోంది. రామన్నగూడెం పుష్కరఘాట్‌కు నీరు చేరుకుంటోంది. విస్తారంగా వర్షాలు కురుస్తున్న కారణంగా మెట్ట పంటలకు జీవం, వరినాటుల్లో ఊపు పెరిగింది. నెర్రలు తేలిన మడుల్లో నిండుగా నీళ్లు చేరుకుంటుండటంతో రైతన్నల్లో ఆనందం వెల్లువిరుస్తోంది. ఇప్పటికే తెలంగాణ వ్యాప్తంగా సకాలంలో వర్షాలు పడని కారణంగా భూగర్భ జలాలు అడగంటిపోయి సాగునీరు కాదు కదా, తాగునీటికి కూడా కష్టాలు మొదలుకాగా ఈ మూడు రోజుల పాటు కురుస్తున్న వర్షాలతో ఊపిరి పీల్చుకున్నట్లైంది.

బ్యారేజీల్లో జలకళ

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మహదేవ్‌పూర్ మండలంలో కాళేశ్వరం ప్రాజెక్టులో నిర్మించిన మేడిగడ్డ అన్నారం బ్యారేజీల్లో జలకళ సంతరించుకుంది. గత రెండు రోజులుగా ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో ప్రాణహిత, గోదావరి నదులు రావడంతో ఆయా బ్యారేజీల వద్ద నీటి ప్రవాహం నిండుకుండలా కనిపిస్తున్నాయి. రెండు రోజులుగా కురుస్తున్న ఎడతెరపీ లేని భారీ వర్షాలతో లోతట్టు మండలమైన పలిమెలలో జనజీవనానికి తీవ్ర అంతరాయం కలిగింది. దీంతో ఆయా మండల ప్రజలు బాహ్యప్రపంచానికి దూరమయ్యారు. మేడిగడ్డ బ్యారేజీ వద్ద 94.5 నీటి లెవల్ ఉండగా 4.5 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్టు ఇఇ రమణారెడ్డి తెలిపారు. ఆదివారం కనె?నపల్లి పంపుహౌస్‌లో 3 మోటార్ల ద్వారా 6,900 క్యూసెక్కుల నీటిని అన్నారం బ్యారేజీలోకి ఎత్తిపోస్తున్నాయి. దీంతో అన్నారం బ్యారేజీ వద్ద నీటి లెవల్ 98.6 లెవల్‌కు చేరినట్లు అధికారులు తెలిపారు. భారీ వర్షాలతో ఆయా బ్యారేజీలు వరద నీటితో జలకళ సంతరించుకుంది. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి సందర్శకులు వచ్చి ఆనందంగా గడిపారు.

# ఆర్టీసీ బస్సుల్లో వృద్ధులు, మహిళలకు రిజర్వేషన్

### 50శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కలెక్టర్ ఆదేశాలు

శ్రీకాకుళం,జూలై 29(ఆర్ఎన్ఎ): మహిళలకు, వయో వృద్ధులకు బస్సులలో 50 శాతం సీట్లు రిజర్వేషను కల్పిస్తున్నట్లు జిల్లా కలెక్టరు జె.నివాస్ తెలిపారు. సోమవారం ఆర్‌టిసి బస్ కాంప్లెక్సు లో శ్రీకాకుళం - విజయనగరం మార్గంలో ప్రయాణించే మహిళలు, వయో వృద్ధుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రిజర్వేషను కౌంటరును జిల్లా కలెక్టర్ జె.నివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జె.నివాస్ మాట్లాడుతూ.. ఉదయం, సాయంత్రం వేళలలో ప్రయాణీకుల రద్దీ ఎక్కువగా ఉంటుందని, మహిళలు, వృద్ధులు బస్సు ఎక్కడానికి చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆ సమస్యను పరిష్కరించడం కోసం వారికి 16 బస్సులలో 50 శాతం సీట్లు కేటాయించినట్లు తెలిపారు. ప్రస్తుతానికి విజయనగరం మార్గంలో ప్రయోగాత్మకంగా దీనిని అమలు చేస్తున్నామని, భవిష్యత్తులో ఇతర మార్గాలలో కూడా దీనిని అమలు చేస్తామని ప్రకటించారు. ఈ సదుపాయాన్ని మహిళలు, వయో వృద్ధులు వినియోగించుకోవాలని జిల్లా

# తిరుమల నుంచి వస్తూ తిరిగిరాని లోకానికి..



మద్దిపాడు, జూలై 29: తిరుమల వెళ్లి దైవదర్శనం చేసుకుని తిరుగు ప్రయాణంలో రోడ్డు ప్రమాదానికి గురై నలుగురు దుర్మరణం పాలైన సంఘటన ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం గుండ్లాపల్లి వద్ద ఆదివారం చోటుచేసుకుంది. కారు డ్రైవర్ అతి వేగంగా నడుపుతూ ముందు వెళుతున్న పాల ట్యాంకర్‌ను వెనుక వైపు ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం ఒంగోలులోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాద సంఘటన వివరాలను ఎస్ఐ విలేఖరులకు వివరించారు. మద్దిపాడు మండల పరిధిలోని గుండ్లాపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో కృష్ణా జిల్లా పమిడిముక్కల మండలం మేడూరు గ్రామానికి చెందిన తండ్రీకొడుకులు, అదే జిల్లా తోట్లవల్లూరు మండలం దేవరపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు దుర్మరణం పాలయ్యారు. విప్పంశెట్టి పాండురంగారావు (42) మేడూరు గ్రామంలో కిరాణా షాపు నిర్వహిస్తున్నాడు. ఆయన కుటుంబం, అతడి బావమరిదితో కలిసి తిరుమలకు వెళ్లడానికి జొన్నల సాంబిరెడ్డి కారును బాడుగకు మాట్లాడుకున్నారు. ఆ కారులో పాండురంగారావు, ఆయన భార్య అనురాధ, కుమారుడు శ్యాంసత్యసాగర్ (10), కుమార్తె భానుప్రియ, బావ శేగు వీరవెంకట నరసింహారావు (39) తిరుమలకు వెళ్లి శ్రీవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణమయ్యారు. ఆదివారం తెల్లవారుజామున సుమారు మూడు గంటల సమయంలో ముందు వెళుతున్న పాల ట్యాంకర్‌ను కారు వెనుక నుండి అతి వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పాండురంగారావు కుమారుడు శ్యాంసత్యసాగర్, బావ వీరవెంకట నరసింహారావు, డ్రైవర్ సాంబిరెడ్డి అక్కడికక్కడే మృతి చెందారు. పాండురంగారావు భార్య అనురాధ, కుమార్తె భానుప్రియకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. ఘటనా స్థలాన్ని ఒంగోలు డిఎస్‌పి ప్రసాద్, ఒంగోలు రూరల్ సిఐ పి సుబ్బారావు సందర్శించారు. మృతదేహాలను శవపంచనామా నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. పాండురంగారావు భార్య అనురాధ ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎస్‌కె ఖాదర్ బాషా కేసు నమోదు చేశారు. సిఐ పి సుబ్బారావు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. అనురాధ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

# రైల్వేల ప్రైవేటీకరణ విధానాలు వీడాలి

ఏలూరు,జూలై29(ఆర్ఎన్ఎ): రైల్వేను ప్రైవేటీకరించాలనే మోడి ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ.. సిఐటియు, ఐఎఫ్‌టియు, ఎఐటియుసి, హెచ్‌ఎంఎస్ ల ఆధ్వర్యంలో ఏలూరు రైల్వే స్టేషన్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ప్రజా సౌకర్యాలను, రాయితీలను రద్దు పరిచి, కార్పొరేట్లకు మేలు చేసే బిజెపి విధాలను వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. రైల్వే ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ.. కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పిఠాపురం రైల్వే స్టేషన్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ప్రజా సౌకర్యాలను, రాయితీలను రద్దు పరిచి, కార్పొరేట్లకు మేలు చేసే బిజెపి విధాలను వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు.

# రష్యాలో పాలకొల్లు యువకుడి మృతి

### మృతదేహం కోసం కలెక్టర్‌కు వినతి

ఏలూరు,జూలై29(ఆర్ఎన్ఎ): ఆదివారం రష్యాలో ప్రమాదవశాత్తూ నదిలో పడి మృతి చెందిన పాలకొల్లు యువకుని మృతదేహాన్ని పాలకొల్లుకు తీసుకొచ్చేందుకు యువకుని మేనమామ రాజేష్ సోమవారం ఉదయం జిల్లా కలెక్టర్ రేవు ముత్యాలరాజును కలిసి అభ్యర్థించాడు. వివేక్ తల్లిదండ్రులు శ్యాం బాబు, స్వర్ణలతలు గత 20 ఏళ్లుగా జీవనోపాధి కోసం కువైట్ లో ఉంటున్నారు. వివేక్ తరచూ పాలకొల్లులో ఉండే తన మేనమామ వర్దనపు రాజేష్, అమ్మమ్మ ఇంటికి వస్తుంటాడు. ఈ క్రమంలో.. వివేక్ ఆదివారం రష్యా లోని తన స్నేహితుని పుట్టినరోజు వేడుకల్లో పాల్గనడానికి వెళ్లి ప్రమాదవశాత్తు నదిలో పడి మృతి చెందాడు. ఈ విషయాన్ని రష్యా పోలీసులు తండ్రి శ్యాంబాబుకు తెలిపారు. వివేక మృతదేహాన్ని పాలకొల్లుకు తీసుకొచ్చేందుకు మేనమామ రాజేష్ సోమవారం జిల్లా కలెక్టర్ రేవు ముత్యాలరాజును కలిసి అభ్యర్థించాడు. వివేక తల్లిదండ్రులు కూడా (రేపు) మంగళవారం పాలకొల్లు వచ్చేందుకు ఏర్పాట్లు చేసుకున్నట్లు మేనమామ పత్రికలకు తెలిపారు.

### చిట్టినాయుడూ..

# కొద్దిరోజులు ఓపికపట్టు

- మీరు నిప్పులో, తప్పులో ప్రజలే చెబుతారు
- సతీశ్‌తో బాబు, టీడీపీ నేతల సంబంధాలపై కేంద్రం దర్యాప్తు జరిపించాలి
- చంద్రబాబు, లోకేశ్‌పై వైసీపీ నేత విజయసాయిరెడ్డి విమర్శలు

అమరావతి, జులై29(ఆర్ఎన్ఎ) : మాంసం వ్యాపారి మొయిన్‌ఖురేషీ మనీల్యాండరింగ్ కేసులో హైదరాబాద్‌కు చెందిన వ్యాపారి సాన సతీశ్‌కుమార్‌ను ఈడీ అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. ఈ కేసుతోనే సీబీఐ ఉన్నతాధికారుల మధ్య లుకలుకలు బయటపడటమే కాదు, ఒకరిపై ఒకరు కేసులు నమోదుచేసుకునే వరకు వెళ్లి, ఆ సంస్థ ప్రతిష్ఠను బజారుకీడ్చింది. తాజాగా, సానా సతీశ్‌ను ఈడీ అరెస్ట్ చేయడంతో మరోసారి ఈ కేసు వార్తల్లో నిలిచింది. ఈ నేపథ్యంలో చంద్రబాబుపై వైసీపీ నేత విజయసాయి రెడ్డి విమర్శలు గుప్పించారు. సాన సతీశ్‌తో బాబు, ఇతర టీడీపీ నేతల సంబంధాలపై కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ట్విట్టర్‌లో పలు ఆరోపణలు చేస్తూ... చిన్న ఉద్యోగం చేసుకునే సాన సతీశ్, అంతర్జాతీయ ఆర్థిక నేరగాళ్లకు పనులు చేసిపెట్టే స్థాయికి ఎదగడం వెనుక చంద్రబాబు ఉన్నారని, ఈ విషయం అందరికీ తెలుసని ఆరోపించారు. అలాగే రాజధాని అమరావతిలో వేల ఎకరాలు లాగేసుకున్నారని లోకేశ్‌ను ఉద్దేశించి మరో ట్వీట్ చేశారు. అమాయక రైతుల పొట్టకొట్టి మీరు, మీ బినామీల లాగేసుకున్న వేలాది ఎకరాల స్టోరీలను సీరియల్‌గా బయటకు తీసుకొస్తాయని వ్యాఖ్యానించారు.

కొద్ది రోజులాగు చిట్టి నాయుడూ.. అమరావతి కలల రాజధానో, కులపు రాజధానో తెలుస్తుంది. ఇన్‌సైడర్ ట్రేడింగుతో అమాయక రైతుల పొట్టకొట్టి మీరూ, మీ బినామీలు లాగేసుకున్న వేల ఎకరాల స్టోరీలన్నీ సీరియల్‌గా బయటకొస్తాయి. మీరు నిప్పులో తుప్పులో ప్రజలే చెబుతారు. కాండ్రించి ఉమ్ముతారంటూ విజయసాయి ట్వీట్‌లో పేర్కొన్నారు.

### ఐదుశాతం రిజర్వేషన్లపై ..

# ఏ కోర్టు స్టే ఇచ్చింది?

- కోర్టుస్టే ఉంటే వచ్చే ఎన్నికల వరకు నోరు తెరవను
- మీరిస్తామన్న రూ.2వేల కోట్లకు ఆశపడి కాపులు ఓట్లేశారనుకుంటున్నారా?
- సీఎం జగన్‌కు ముద్రగడ పద్మనాభం బహిరంగ లేఖ

అమరావతి, జులై29(ఆర్ఎన్ఎ) : అగ్రవర్ణ పేదల రిజర్వేషన్లలో కాపులకు 5శాతం కోటా కుదరదన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం సోమవారం బహిరంగ లేఖ రాశారు. కోర్టులో కేసులు ఉన్నందున రిజర్వేషన్ల అమలు కుదరదన్నట్లు పత్రికల్లో చదివానని, అయితే ఎక్కడ స్టే ఇచ్చారో

అసెంబ్లీలోగానీ, మీడియాతోగానీ చెప్పి ఉంటే సంతోషించేవాడినని అన్నారు. నిజంగా కోర్టులో స్టే ఉంటే మళ్లీ ఎన్నికల వరకు నోటికి ప్లాస్టర్ వేసుకుంటామని ముద్రగడ స్పష్టం చేశారు. మీరు ఇస్తానన్న రూ.2వేల కోట్లకు ఆశపడి ఓట్లు వేశారని భావిస్తున్నారా?అని సీఎంను ప్రశ్నించారు. మా జాతి బానిసలుగా బతకాలని మీ అభిప్రాయమా? అంటూ లేఖలో ఘాటు వ్యాఖ్యలు చేశారు. అగ్రవర్ణపేదలకు కేంద్రం ఇచ్చిన 10శాతం రిజర్వేషన్లలో 5శాతం కాపులకు కేటాయిస్తామని చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రకటించారని గుర్తు చేశారు. 25 మంది ఎంపీలను గెలిపిస్తే ప్రత్యేక హోదా తెస్తామన్నారని, కానీ, ప్రస్తుతం కేంద్ర ఆర్థిక, హోం మంత్రులు లోక్‌సభలో హోదా ముగిసిన అధ్యాయం అంటున్నారని లేఖలో పేర్కొన్నారు. అయ్యా.. ఆ మధ్య తమరి సోదరి షర్మిల మీద సోషల్ మీడియాలో బూతులు ప్రచారం అయిన సందర్భంగా వారు బాధతో, ఆవేదనతో హైదరాబాద్ పోలీస్ స్టేషన్‌లో రిపోర్టు ఇచ్చే పరిస్థితి వచ్చిందని, అలాగే ఈ రోజు నన్ను కాపు ద్రోహి, స్వార్థపరుడు, గజదొంగ, అమ్ముడుపోయాడు, మునిగిపోయిన ముద్రగడ అని ఎన్నో బూతులు అన్ని పార్టీల వారు రాయిస్తున్నారని ముద్రగడ అన్నారు. వాటికి బెదిరిపోవడానికి నేనేమీ ఎన్ఆర్ఐను కాదండి. దయచేసి నేను కూడా మీ సోదరి షర్మిలగారి లాంటివాడినే అని గ్రహించమని కోరుతున్నానని ముద్రగడ అన్నారు.

# కాపు రిజర్వేషన్లకు వైసీపీ కట్టుబడి ఉంది

- బాబు తీరుతోనే కాపులు బీసీలా? ఓసీలా? అన్న పరిస్థితి తలెత్తింది
- సీఎంతో భేటీ అయిన వైసీపీ కాపునేతలు
- కాపు రిజర్వేషన్‌లపై త్రిసభ్య కమిటీ ఏర్పాటుచేసిన జగన్
- కాపు కార్పొరేషన్ ఛైర్మన్‌గా జక్కంపూడి రాజా నియామకం

అమరావతి, జులై29(ఆర్ఎన్ఎ) : కాపుల రిజర్వేషన్‌లకు వైసీపీ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డి అన్నారు. వైసీపీ కాపు ప్రజా ప్రతినిధులు (మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు) సోమవారం ముఖ్యమంత్రిని అసెంబ్లీ ఛాంబర్‌లో కలిశారు. ఈ సందర్భంగా కాపు రిజర్వేషన్ల అంశంపై తాజా పరిణామాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వచ్చారు. కాపు రిజర్వేషన్ల అంశంపై సీఎం జగన్ మాట్లాడుతూ.. కాపుల రిజర్వేషన్ల విషయం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వైఖరిలో ఎలాంటి మార్పులేదని, మేనిఫెస్టోలో చెప్పినదానికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. కాపు రిజర్వేషన్లపై మంజునాథ్ కమిషన్ ఇచ్చిన నివేదికను పరిశీలించాల్సిందిగా పార్టీ నేతలు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, అంబటి రాంబాబు, కురసాల కన్నబాబులతో కమిటీని నియమించారు. కాపు రిజర్వేషన్ల అంశాన్ని తెలుగుదేశం పార్టీ తన స్వార్థ రాజకీయాల కోసం వాడుకోవడానికి ప్రయత్నిస్తోందని జగన్ అన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు తీసుకున్న చర్యల వల్ల ఇవాళ కాపులు బీసీలా? ఓసీలా? అన్న పరిస్థితి తలెత్తిందని ఆయన వ్యాఖ్యానించారు. కాపులను బీసీల్లో చేరుస్తూ 2017లో చంద్రబాబు నాయుడు కేంద్రానికి లేఖ పంపారని, తర్వాత ఈబీసీల్లో కాపులకు 5శాతం రిజర్వేషన్లు ఇస్తూ మరొక లేఖ రాశారని, అసలు కాపులను బీసీల్లో చేరుస్తూ ఇంతకు ముందు పంపిన బిల్లు పరిశీలనలో ఉంచదలచుకున్నారా? దానికి కట్టుబడి ఉన్నారా? లేక ఉపసంహరించాలనుకుంటున్నారా? దీనిపై వెంటనే సమాధానం ఇవ్వాలని చంద్రబాబు సర్కార్‌ను కేంద్రం కోరిందని, దీనిపై ఈ ఏడాది ఏప్రిల్ 4న కేంద్రం రాసిన లేఖకు చంద్రబాబు సమాధానం పంపలేదన్నారు. పేదరికం ప్రాతిపదికగా ఓసీల్లో పేదలకు ఈ పదిశాతం రిజర్వేషన్లు ఇచ్చారని, దాంట్లో కులాన్ని ప్రాతిపదికగా తీసుకునే అవకాశమే లేదని, కులాల పరంగా విభజించే హక్కులేదని తెలిసి కూడా కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలకు వ్యతిరేకంగా రాష్ట్రంలో ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. చంద్రబాబు కాపులను బీసీల్లో చేర్చడంపైనా, ఈబీసీల్లో ఇచ్చిన 5శాతం కోటాలపైనా న్యాయస్థానాల్లో కేసులు ఉన్నాయని, ఈ నేపథ్యంలో అడుగు ముందుకు వస్తే ఈ కోట కింద సీట్లు, ఉద్యోగాలు పొందినవారి పరిస్థితి ఏమవుతుంది?. ఈబీసీ కోటాలో కాపులకు తాను ఇచ్చిన 5శాతం రిజర్వేషన్‌లు వాస్తవమే అయితే ఈ ఏడాది వైద్య, పీజీ సీట్లలో చంద్రబాబు సర్కార్ ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. ఈబీసీలకు కేంద్రం ఇచ్చిన కోటాలో అయిదు శాతం రిజర్వేషన్లు ఇస్తాననడం ద్వారా, ఇంతకు ముందు బీసీల్లో చేర్చే అవకాశం ఉందన్న కాపులకు కల్పించిన ఆశలమీద కూడా చంద్రబాబే నీళ్లు జల్లారని జగన్ అన్నారు. కాపుల రిజర్వేషన్ల విషయం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వైఖరి ఎప్పుడూ మార్పులేదని, మొదటి నుంచి మేం చెబుతున్నట్లే బీసీల హక్కులకు భంగం కలగకుండా, వారి ప్రయోజనాలకు నష్టం రాకుండా జరిగే కాపు రిజర్వేషన్లకు మనం వ్యతిరేకం కాదన్నారు. కాపు రిజర్వేషన్లకు ఎప్పుడూ మద్దతు ఉంటుంది, మేనిఫెస్టోలో చెప్పినదానికి కట్టుబడి ఉన్నామని జగన్ ఈ సందర్భంగా వైసీపీ కాపు నేతలతో పేర్కొన్నారు. ఈ బడ్జెట్‌లో కాపులకు రూ.2వేల కోట్లు కేటాయించామని, కానీ చంద్రబాబు అయిదేళ్ల పాలనలో ఖర్చు చేసింది కేవలం రూ.1340 కోట్లే అని జగన్ తెలిపారు.

### కాపు కార్పొరేషన్ ఛైర్మన్‌గా జక్కంపూడి రాజా..

ఆంధ్రప్రదేశ్ కాపు కార్పొరేషన్ ఛైర్మన్‌గా వైఎస్సార్‌సీపీ రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కాగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడిగా పేరొందిన జక్కంపూడి రామ్మోహన్ తనయుడే రాజా. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి జక్కంపూడి కుటుంబం.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వెంటే ఉన్నారు. మరోవైపు జక్కంపూడి రాజాను కాపు కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమించడంపై కాపు సామాజిక వర్గనేతలు హర్షం వ్యక్తం చేశారు.

# బిందు తుంపర సేద్యానికి ప్రాధాన్యం

### వాననీటి సంరక్షణలో రైతులు ముందుండాలి

అనంతపురం,జూలై29(ఆర్ఎన్ఎ): బోరున్న ప్రతి రైతు బిందు, తుంపర సేద్యం పరికరాలను వినియోగించుకోవాలన్నదే రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన ఉద్దేశమని సూక్ష్మసేద్య పథక సంచాలకులు అన్నారు. జిల్లాలో 35 వేల హెక్టార్లలో డ్రిప్ మంజూరు లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. జిల్లాలో హంద్రీనీవా పరివాహక ప్రాంతాల రైతులకు తుంపర సేద్యం పరికరాల పంపిణీలో ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు.

ఉరవకొండ, వజ్రకరూరు, విడపనకల్లు, గుంతకల్లు, రాప్తాడు, ఆత్మకూరు, బెళుగుప్ప, పెనుకొండ మండలాల పరిధిలో హంద్రీనీవా కాలువలో నీరు పారుతోంది. ఆయా ప్రాంతాల రైతులతో తుంపర సేద్యం పరికరాలకు దరఖాస్తులు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అలాగే బిందు, తుంపర సేద్యంతో ఉద్యాన పంటల్లో అత్యధిక దిగుబడులు సాధించిన రైతులను పంచాయతీకొకరు చొప్పున ఎంపిక చేయాలన్నారు. వారందరికీ డ్రిప్‌పై పూర్తిస్థాయిలో శిక్షణ ఇప్పించడం జరుగుతుందన్నారు. శిక్షణ పొందిన రైతులతో గ్రామాల్లోని ఇతర రైతులకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఇదిలావుంటే పల్లెల్లో సేంద్రియ వ్యవసాయంపై రైతుల్లో విస్తృత అవగాహన కల్పించే దిశగా కార్యక్రమాలు ఉండాలని తెలిపారు. గతంలో డీఆర్‌డీఏ-వెలుగు ప్రాజెక్టులో ఎన్‌పీఎం విభాగం ద్వారా సేంద్రియంపై ప్రత్యేక దృష్టి సారించామని, సత్ఫలితాలు వచ్చాయన్నారు. ప్రస్తుతం ఈ విభాగాన్ని వ్యవసాయ శాఖలోకి విలీనం చేశారని, సేంద్రియ ఎరువుల వాడకాన్ని ప్రోత్సహించాలన్నారు. క్షేత్ర స్థాయిలో ఎరువును ఎలా తయారు చేసుకోవాలన్న దానిపై రైతుల్లో పరిపూర్ణ అవగాహన కల్పించాల్సి ఉందన్నారు. రసాయన ఎరువుల వల్ల రైతులు నష్టపోతారన్నారు. అలాగే భూముల్లోనూ సారవంతం తగ్గుతుందన్నారు. సేంద్రియ ఎరువుల వల్ల దిగుబడి అధికంగా రావడమే కాదు.. భూమి సారవంతంగా తయారవుతుందన్నారు.

# ప్రజా సమస్యల కోసమే ప్రతిస్పందన: కలెక్టర్

విజయవాడ, జూలై 29 (ఆర్ఎన్ఎ): కృష్ణా జిల్లా కైకలూరులో స్థానిక మార్కెట్ యార్డులోని రైతు కల్యాణ మండపంలో ప్రత్యేక స్పందన కార్యక్రమాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ ఎండి ఇంతియాజ్ ప్రారంభించారు. జాయింట్ కలెక్టర్ మాధవి లత, ఆర్‌డిఒ సత్యవాణి లు అర్జీదారుల నుండి అర్జీలను స్వీకరించి సంబంధిత అధికారులకు తదుపరి చర్యల నిమిత్తం ఆదేశించారు. కలెక్టర్ ఎండి ఇంతియాజ్ మాట్లాడుతూ... ప్రజల సమస్యల పరిష్కారం కోసమే స్పందన కార్యక్రమాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు.

నియోజకవర్గంలోని కైకలూరు కలిదిండి, మండవల్లి, ముదినేపల్లి మండలాల నుండి అర్జీదారులు భారీగా తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులతో పాటు స్థానిక అధికారులు పాల్గన్నారు.

## ములుగు



# నెమ్మదిగా పెరుగుతున్న గోదావరి ప్రవాహం

## పేరూరులో 5.4 మీటర్ల నీటిమట్టం

ములుగు, జులై 29 (నేటినిజం ప్రతినిధి):ఏకధాటి వర్షాలతో గోదావరికి వరద నీరు నెమ్మదిగా పెరుగుతోంది. వాగుల నుంచి వస్తున్న వరద నీటితో గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. వర్షాలతో పేరూరు వద్ద గోదావరి నీటిమట్టం ఆదివారం సాయంత్రానికి 5.4 మీటర్లకు (సుమారు 17 అడుగులు) చేరింది. గోదావరి ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు రానప్పటికీ ఛత్తీస్‌గఢ్, వాజేడు మండలంలో కురిసిన వర్షాలతో గోదావరికి వరద నీరు భారీగా చేరుతోంది. పేరూరులో ఆదివారం ఉదయానికి 64.6 మి.మీ వర్షపాతం కురవగా సాయంత్రానికి 30.6 మి.మీ వర్షపాతం నమోదైనట్లు కేంద్ర జలవనరుల సంఘం సిబ్బంది పేర్కొంటున్నారు. కుండపోత వర్షాలతో వాగుల నుంచి వరదనీరు భారీగా వస్తోంది. వాజేడు మండలంలోని చీకుపల్లివాగు, కొంగాలవాగు, ఇసుకవాగు, మరిమాగువాగులు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. గోదావరి ఎగువ ప్రాంతం నుంచి వరదనీరు రానప్పటికీ ఏకధాటి వానలతో వాగుల నుంచి వస్తున్న వరద నీటితో ఆదివారం మధ్యాహ్నం నుంచి నీటిమట్టం పెరుగుతున్నట్లు కేంద్ర జలవనరుల సంఘం సిబ్బంది పేర్కొంటున్నారు.

గోదావరి వరదను తిలకిస్తున్న జలపాతం సందర్శకులు: బొగత జలపాతాన్ని చూసేందుకు వచ్చిన సందర్శకులు గోదావరి వరదను తిలకిస్తున్నారు. పూసూరు సమీపంలోని గోదావరి వంతెనపై వాహనాలను నిలిపి గోదావరి వరద ప్రవాహాన్ని ఆనందంగా తిలకిస్తున్నారు. జలపాతం సందర్శనకు వచ్చిన పర్యాటకుల వాహనాలు గోదావరి వంతెనపై బారులు తీరాయి. కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులతో కలిసి వచ్చిన పర్యాటకులు బృంద చిత్రాలను తీసుకుంటున్నారు. చరవాణుల్లో స్వీయచిత్రాలను తీసుకునేందుకు ఉత్సాహం కనబరుస్తున్నారు.

## వనదేవతల సన్నిధికి తరలివస్తున్న భక్తులు

ములుగు, జులై 29 (నేటినిజం ప్రతినిధి): జిల్లాలో పర్యాటకుల ప్రయాణం జలపాతాన్ని వీక్షించేందుకు వెళ్లే పర్యాటకులు మార్గ మధ్యలో ఉన్న మేడారానికి వచ్చి సమ్మక్క, సారలమ్మ దేవతలను దర్శించుకోవడం పరిపాటిగా మారింది. మరికొంత మంది బొగత వెళ్లి తిరుగు ప్రయాణంలో అమ్మవార్ల సేవలో తరించిపోతున్నారు. ఆదివారం సెలవురోజు కావడంతో మేడారంలో భక్తుల కోలాహలం కనిపించింది. హైదరాబాద్, వరంగల్, హన్మకొండ తదితర ప్రాంతాలకు చెందిన వందలాది మంది వర్షాన్ని సైతం లెక్క చేయకుండా తరలివచ్చి జంపన్నవాగులో పుణ్యస్నానాలు చేశారు. తమ చిన్నారులకు తలనీలాలర్పించారు. జంపన్న గద్దె వద్ద ముడుపులు కట్టారు. గద్దెల ప్రాంగణానికి వచ్చి ఎత్తుబెల్లం, ఒడిబియ్యం, పూలు పండ్లు, నూతన వస్త్రాలు సమర్పించి దేవతలకు పూజలు చేశారు. దర్శనం అనంతరం మేడారంలోని అతిథిగృహాలు, అద్దె సత్రాల్లో విడిది చేసి రోజంతా ఆటపాటలతో గడిపారు. అనూహ్యంగా పెరిగిన భక్తులకు పూజారులు సిద్దబోయిన జగ్గారావు, చందా గణేశ్, గోపాల్‌రావు, కాక సారయ్య, కిరణ్, వెంకటేశ్వర్లు, రంజిత్ తదితరులు గద్దెలపై ఉండి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు తీసుకువచ్చిన కానుకలను అమ్మవార్లకు సమర్పించి ప్రతిగా పసుపు కుంకుమలందించారు. సివిల్, సీఆర్పీఎఫ్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

# జిల్లాను సస్యశ్యామలం చేసే దిశగా చర్యలు

## ప్రాజెక్టులపై ఇంకా విమర్శలు తగవు

నల్గొండ,జూలై29(ఆర్ఎన్ఎ): కృష్ణా, గోదావరి జలాలతో ఉమ్మడి జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు సహకరిస్తున్న ముఖ్యమంత్రి ముమ్మాటికీ అపరభగీరథుడని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపా÷–ల రెడ్డి వ్యాఖ్యానించారు. మిషన్ భగీరథ, భక్తరామదాసు పథకాల పూర్తితో తమది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని నిరూపించామన్నారు. ప్రభుత్వం ఏదైనా సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో సాంకేతికపరమైన, అటవీ, పర్యావరణ, భూసేకరణ వంటి సమస్యలు ఉత్పన్నం అయితే ఇరిగేషన్ వ్యవస్థ పూర్తిగా దెబ్బతిని ప్రభుత్వంతోపాటు ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటారని పేర్కొన్నారు. రైతులతో నేరుగా సంప్రదించి, వారి ఇష్టానుసారమే భూములను సేకరించటం ప్రభుత్వ ఉద్దేశ్యమన్నారు. రైతులే ముందుకు వచ్చి భూములు ఇస్తున్నా, పది సంవత్సరాలు అధికారంలో ఉండి ఎకరాకు కూడా సాగునీరు అందించలేని వారు, ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. రూ.4500 కోట్లతో మిషన్‌భగీరథ, రూ.1000 కోట్లతో ఇంటింటికి నల్లాను ఏర్పాటు చేసి గోదావరి జలాలను ప్రభుత్వం అందించనుందన్నారు.

గత ప్రభుత్వాలు కమీషన్ల కోసమే ప్రాజెక్టులను చేపట్టి ప్రజలను మోసం చేయడం జరిగిందన్నారు. తెలంగాణలో చేపట్టబోతున్న భారీ నీటిపారుదల ప్రాజెక్టులు భవిష్యత్ తరాలకు దారిచూపడం ఖాయమన్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో గెలుపు లక్ష్యం: బిజెపి

కామారెడ్డి,జూలై29(ఆర్ఎన్ఎ): రానున్న మున్సిపల్ ఎన్నికల్లో బిజెపిని అత్యదజక సీట్లలో గెలపించడ ద్వారా పట్టణ స్థాయిలో పార్టీని పటిష్టపరచడానికి కృషి చేస్తామని జిల్లా అధ్యక్షుడు బాణాల లక్ష్మారెడ్డి అన్నారు. కేంద్రంలో మోడీ తీసుకుంటున్న నిర్ణయాలే తమకు శ్రీరామరక్ష అన్నారు. భాజపా సంస్థాగత పటిష్టానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. బూత్‌స్థాయిలో కార్యకర్తల ద్వారా పార్టీని బలోపేతం చేస్తామన్నారు. తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా రాష్ట్రం అంతటా పెద్దఎత్తున కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించామని అన్నారు. సెప్టెంబరు 17న ఉత్తర తెలంగాణలో భారీ బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించింది. ప్రజలు ఎదుర్కొంటున్న ముఖ్య సమస్యలు, రెండు పడకగదుల పథకం, రైతు సమస్యలపై పోరాటాలు చేస్తామని అన్నారు. ఇతర పార్టీల నేతల చేరికల కంటే అంతర్గతంగా పార్టీని బలోపేతం చేయడంపై దృష్టి సారించామని అన్నారు. .

# ప్రగతి ముందు బులెట్లు కొరగావు



న్యూఢిల్లీ, జూలై 29: కాశ్మీర్ అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నాలు ఎన్నటికీ సఫలం కావని ప్రధాని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. వైషమ్యాలు రగిలించి అభివృద్ధిని అడ్డుకునే శక్తుల పన్నాగాలను ఎంత మాత్రం సాగవని ఆదివారం ప్రసారమైన 'మన్‌కీ బాత్' కార్యక్రమంలో అన్నారు. అభివృద్ధి శక్తి ముందు బుల్లెట్లు, బాంబులు ఏ మాత్రం కొరగావన్న వాస్తవాన్ని ఇటీవల పరిణామాలు స్పష్టం చేశాయన్నారు. ఇటీవల కాశ్మీర్‌లో నిర్వహించిన తిరిగి పల్లెకు అన్న కార్యక్రమంగా పెద్ద ఎత్తున గ్రామస్థులు పాల్గొన్నారని మోదీ గుర్తు చేశారు. ఆ సందర్భంగా అధికారులు అభివృద్ధి అంశాల గురించి వారితో మాట్లాడారని, కాశ్మీర్ గ్రామస్తుల్లో ఎంతో ఉత్సాహం కనిపించిందని చెప్పారు. దీనిని బట్టి చూస్తే అభివృద్ధిలో పాలు పంచుకోవడానికి, ప్రగతి ఫలాలు అందుకోవడానికి కాశ్మీర్ ప్రజలు ఎంతగా ఆరాటపడుతున్నారో కూడా స్పష్టమవుతున్నదన్నారు. కాశ్మీర్‌లోని అనేక మారుమూల గ్రామాలకు, సరిహద్దు గ్రామాలకు కూడా అధికారులు వెళ్ళారని మొత్తం 4500 పంచాయతీలను సందర్శించి అక్కడి అభివృద్ధి అంశాలపై చర్చించారని అన్నారు. దాదాపు 25 నిమిషాల పాటు మాట్లాడిన మోదీ అనేక అంశాలను ప్రస్తావించారు. ఆగస్టు 15న సరికొత్త రీతిలో నిర్వహించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. దీనిని ప్రజా ఉత్సవంగా మార్చుకోవాలన్నారు. దేశ వ్యాప్తంగా వరద పరిస్థితులను ప్రస్తావించిన ఆయన ఆయా రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి కేంద్రం పని చేస్తున్నదన్నారు. జల సంరక్షణ ఉద్యమంలో దేశ ప్రజలను కదిలించి ఒదన్న మోదీ మేఘాలయ, హర్యానా ప్రభుత్వాలు ఈ దిశగా తీసుకున్న చర్యలను పరిశీలించారు. ఆత్మవిశ్వాసం, నిర్భయం అన్నది చంద్రయాన్–2 ద్వారా నేర్చుకున్న గొప్ప పాఠాలని మోదీ ఈ సందర్భంగా తెలిపారు. సాంకేతిక లోపం కారణంగా ఆగిన చంద్రయాన్–2 కొన్ని రోజుల వ్యవధిలోనే అద్భుతంగా విజయం కావడం భారత శాస్త్రవేత్తల సత్తాకు నిదర్శన మన్నారు. మన ప్రతిభాపాటవాలపై నమ్మకంతో ముందుకు సాగాలని మోదీ ఉద్ఘాటించారు. చంద్రయాన్–2 భారతీయ స్ఫూర్తికి, ఆత్మవిశ్వాసానికి నిలువుటద్దం అని చెప్పారు. భారత శాస్త్రవేత్తలు ప్రపంచంలో ఎవరికీ తీసిపోరని మోదీ ప్రశంసించారు. ఈ సందర్భంగా ఆయన క్విజ్ పోటీని ప్రకటించారు. ఇందులో అత్యధిక మార్కులు సంపాదించుకున్న విద్యార్థులకు సెప్టెంబర్‌లో చంద్రయాన్–2 చంద్రుడిపై దిగి అద్భుత అవకాశాన్ని వీక్షించేందుకు అవకాశం కల్పిస్తామని విజేతలు ఇందు కోసం శ్రీహరి కోట కేంద్రాన్ని సందర్శిస్తారని ఆయన తెలిపారు. ఈ క్విజ్‌లో విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొనాలని, ఇందుకు సంబంధించిన వివరాలను త్వరలోనే ప్రకటిస్తామని మోదీ తెలిపారు. అత్యధిక మార్కులు సంపాదించుకున్న విద్యార్థులకు శ్రీహరి కోటకు తీసుకెళ్ళేందుకు అయ్యే ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. ఈ క్విజ్ కార్యక్రమం పూర్తిగా శాస్త్ర, సాంకేతిక అంశాలపైనే ఉంటుందని ఆయన వెల్లడించారు.

# మానవ అక్రమ రవాణా వ్యతిరేక పోరును ముమ్మరం చేయాలి



హైదరాబాద్, జూలై 29: మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా చేసే పోరాటాన్ని రాజీ లేకుండా ముందుకు తీసుకుపోవాలని, ఇందుకు ప్రభుత్వ సంస్థలతో పాటు పౌరసంఘాలు, స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకు రావాలని ఉప రాష్ట్రపతి ఎం వెంకయ్య నాయుడు పిలుపునిచ్చారు. ఈ సామాజిక జాడ్యం బారిన పడిన చివరి వ్యక్తిని రక్షించే వరకూ, వారికి న్యాయం జరిగే వరకూ పోరును కొనసాగించాలన్నారు. డాక్టర్ సునీతా కృష్ణన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న ప్రజ్వల సంస్థ ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఉప రాష్ట్రపతి ప్రసంగించారు. ఈ సందర్భంగా మానవ అక్రమ రవాణా నుంచి బయట పడిన వారి కోసం ప్రజ్వల నిర్వహిస్తోన్న ఆశ్రమ కేంద్రాన్ని వెంకయ్య నాయుడు సందర్శించి మాన్యువల్‌ను విడుదల చేశారు. ప్రతి ఒక్కరికీ అర్థమయ్యే విధంగా మాన్యువల్‌ను అన్ని భారతీయ భాషల్లోకి అనువాదం చేయాలని సూచించారు. అలాగే తన ఒక నెల జీతాన్ని కూడా వెంకయ్య నాయుడు ప్రజ్వల సంస్థకు విరాళంగా ప్రకటించారు. మానవ అక్రమ రవాణా అనేది కేవలం సామాజిక జాడ్యం మాత్రమే కాదని, ఇది మానవాళికి వ్యతిరేకంగా సాగే హింసాత్మక నేరంగా ఉప రాష్ట్రపతి అభివర్ణించారు. మానవ హక్కులు, న్యాయం, గౌరవం వంటి ప్రాథమిక సిద్ధాంతాలను ఉల్లంఘించే జాడ్యమన్నారు. దీనిని ఆధునిక బానిసత్వంగా భావించాలన్నారు. ప్రతి వ్యక్తికి గౌరవప్రదమైన జీవితాన్ని సాగించే హక్కు ఉంటుందన్నారు. స్వేచ్ఛను అందించి, శ్రమదోపిడీని నిరోధించే విధంగా రాజ్యాంగం చక్కని పునాదులు వేసందన్నారు. బాలకార్మిక వ్యవస్థ, వెట్టి చాకిరి, మానవ అక్రమ రవాణా వంటివి హక్కులను కాలరాసే జాడ్యాలన్నారు. వీటికి వ్యతిరేకంగా పోరాడే పవిత్ర కర్తవ్యాన్ని రాజ్యాంగం ప్రతి పౌరుడి మీద ఉంచిందన్నారు. ఇలాంటి సమస్యల పట్ల సమాజం సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. మానవ అక్రమ రవాణా నుంచి బయటపడిన వారిని రక్షించడం, పునరావాసం కల్పించడం వంటి అంశాల మీద దృష్టి సారించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంకా కేంద్ర మహిళా, శిశు అభివృద్ధిశాఖ సహాయ మంత్రి దేబశ్రీ చౌదరితో పాటు పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# న్యాయ వ్యవస్థపై నమ్మకాన్ని పెంచాలి



హైదరాబాద్, జూలై 29 కోర్టుకు వచ్చే కేసులను త్వరగా పరిష్కరించి ప్రజలకు న్యాయవ్యవస్థపై నమ్మకం కల్గించడానికి న్యాయమూర్తులు, న్యాయవాదులు ఉమ్మడిగా ప్రయత్నించాలని సుప్రీం కోర్టు న్యాయమూర్తి ఎన్వీ రమణ సూచించారు. సికింద్రాబాద్‌లో ఆదివారం సిటీ సివిల్ కోర్టుల భవనాల ప్రారంభోత్సవానికి ఆయన హాజరు అయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదు లు పని సంస్కృతిని అలవర్చుకుని సామాన్య ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు సమష్టిగా కృషి చేయాలన్నారు. న్యాయవ్యవస్థ సంరక్షకులు న్యాయవాదులని వాటి పట్ల ప్రజల్లో నమ్మకం సడలిపోకుండా చూడాల్సిన బాధ్యత న్యాయవాదులపై ఉందన్నారు. యువ న్యాయవాదులు సీనియర్ న్యాయవాదులను, న్యాయమూర్తులను గౌరవించాలని ఆయన హితవు పలికారు. క్షేత్రస్థాయిలో ఉన్న కోర్టులకు సామాన్య ప్రజలు ఎక్కువగా వస్తుంటారని వారికి సకాలంలో స్పందించాలన్నారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తి ఎల్. నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ న్యాయవాదులు, న్యాయమూర్తులు న్యాయవ్యవస్థకు పునరంకితులు కావాలన్నారు. న్యాయ వ్యవస్థలో ఉండే వారు నిరంతర విద్యార్థిగా ఉండాలన్నారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తి ఆర్. సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ సిటీ సివిల్ కోర్ట్ ఆవరణలో దాదాపు రూ. 12 కోట్లతో నిర్మించిన కోర్ట్ భవనాలు ప్రజల సమస్యల పరిష్కారానికి వేదికవ్వాలన్నారు. కోర్టు కేసుల పరిష్కరణ శాతం మెరుగుపడాలన్నారు. కోర్టు భవనాల ప్రారంభోత్సవానికి తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయూర్తి రాఘవేంద్ర చౌహాన్, రాష్ట్ర డీజీపీ మహేందర్‌రెడ్డి, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ అంజనీకుమార్, ప్రధాన న్యాయమూర్తి సుమలత, విశ్రాంత న్యాయమూర్తులు, న్యాయవాదులతో పాటు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# బంగారు తెలంగాణ లక్ష్యంగా కార్యక్రమాలు

## ప్రభుత్వానికి అండగా ప్రతి ఒక్కరూ నిలవాలి: నగేశ

ఆదిలాబాద్,జూలై29(ఆర్ఎన్ఎ): బంగారు తెలంగాణ రాష్ట్ర సాధనకు ముఖ్యమంత్రి కేసీఆర్ కంకణ బద్దులయ్యారని ఆయన అడుగు జాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని మాజీ ఎంపి నగేశ్ పిలుపునిచ్చారు.

తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి సీఎం కేసీఆర్ చేస్తున్న కృషిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. టీఆర్ఎస్ హాయాంలో జరుగుతున్న అభివృద్ధికి పలువురు ఆకర్షితులై పార్టీలో పెద్ద ఎత్తున చేరుతున్నారన్నారు. నియోజకవర్గ మైనార్టీలు అన్ని రంగాల్లో రాణించాలనే ఉద్దేశంతో నిరుపేదలకు ఉన్నత విద్యను అందించాలనే లక్ష్యంతో గురుకుల పాఠశాలలను మంజూరు చేశారని వివరించారు. రైతాంగానికి సాగునీరు అందించాలని కృతనిశ్చయంతో అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలోనే మహారాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకొని పెన్‌గంగాపై బ్యారేజీ నిర్మాణం పనులను చేపట్టామని అన్నారు. దళితుల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని, నిరుపేద విద్యార్థుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలో ఎన్నడు లేని అభివృద్ధి టీఆర్ఎస్ హాయంలో జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

# క్షమాపణలు చెప్పిన అజాంఖాన్

- అధ్యక్ష స్థానంపట్ల ఎలాంటి చెడు ఉద్దేశం లేదు
- నా వ్యాఖ్యల్లో తప్పుంటే నన్ను క్షమించండన్న అజాంఖాన్
- క్షమాపణను ఎట్టిపరిస్థితుల్లోనూ అంగీకరించబోనన్న బీజేపీ ఎంపీ

న్యూఢిల్లీ, జులై29(ఆర్ఎన్ఎ) : బీజేపీ ఎంపీ రమాదేవిపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ అజాం ఖాన్ ఎట్టకేలకు దిగివచ్చారు. సోమవారం లోక్‌సభ వేదికగా ఆయన క్షమాపణ చెప్పారు. అధ్యక్ష స్థానంపట్ల నాకు ఎలాంటి చెడు ఉద్దేశం లేవని, ఒకవేళ నేను మాట్లాడింది అభ్యంతరకరమైతే... అందుకు నేను క్షమాపణ చెబుతున్నానని అజాంఖాన్ పేర్కొన్నారు. సోమవారం లోక్‌సభ సమావేశం ప్రారంభానికి ముందు సమాజవాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్, అజాంఖాన్ స్పీకర్ ఓం బిర్లాతో భేటీ అయ్యారు. అనంతరం లోక్‌సభలో క్షమాపణ చెబుతున్నట్టు ప్రకటించారు. అయితే అజాంఖాన్ క్షమాపణను తాను ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోనని రమాదేవి తెగేసి చెప్పారు.

దేశాన్ని, దేశంలోని మహిళలందర్నీ అజాంఖాన్ వ్యాఖ్యలు గాయపర్చాయని, ఆయన ప్రతిసారీ అలాగే మాట్లాడతారన్నారు. అయినా ఎప్పుడూ మార్పు కనిపించదని, ఆయన తన అలవాటు మార్చుకోవాలని, నోటికి ఏది వస్తే అది మాట్లాడతారన్నారు. దీన్ని మార్చుకోవాల్సిన అవసరం ఉందని రమాదేవి అన్నారు. లోక్‌సభలో రమాదేవిని ఉద్దేశించి ఆజంఖాన్ చేసిన వ్యాఖ్యలు సభలో తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. గురువారం ట్రిపుల్ తలాక్ బిల్లుపై చర్చ సందర్భంగా ఆజంఖాన్ మాట్లాడుతున్న సమయంలో స్పీకర్ స్థానంలో ఉన్న ఎంపీ రమాదేవి.. ఆయనను సభాపతి స్థానాన్ని చూస్తూ మాట్లాడాలని సూచించారు. దీంతో ఆజంఖాన్ ఆమెను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఆయన వ్యాఖ్యలను అన్ని పార్టీలు తీవ్రంగా తప్పుపట్టాయి. సభకు క్షమాపణ చెప్పాల్సిందేనని డిమాండ్ చేశాయి.

# సమస్యల పరిష్కారంలో సర్కార్ విఫలం

## మాయమాటలతో ప్రజలను తప్పుదోవ పట్టించారు: బిజెపి

మెదక్,జూలై29(ఆర్ఎన్ఎ): తెలంగాణ ధనికరాష్ట్రమని చెబుతున్న సిఎం కెసిఆర్ రైతాంగానికి ఎందుకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయలేకపోయారని బిజెపి అధికారప్రతినిధి రఘునందన్రావు అన్నారు.

తెలంగాణలో అన్నీ సాధించామని గొప్పలు చెప్పకుండా సమస్యలపై చిత్తశుద్ధితో దృష్టి సారించాలని అన్నారు. తెరాస పాలనలో రాష్ట్రం భూకబ్జాలు, ఇసుక మాఫియా, కల్తీ విత్తనాలు, ఆహర పదార్థాలకు అడ్డాగా మారగా.. నేరస్థులకు, డ్రగ్స్ విక్రయాలకు హైదరాబాద్‌ను కేంద్రంగా మార్చారని ఎద్దేవా చేశారు. గతంలో నయీం, మియాపూర్ భూకబ్జా కేసుల మాదిరిగానే డ్రగ్స్ కేసును నీరుగార్చారని అన్నారు. ఏడాదికి లక్ష ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించి నిరద్యోగులను మోసం చేస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా అసమర్థ పాలన కొనసాగిస్తున్నారని ఆయన మండిపడ్డారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్.. మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రాన్ని దివాళా తీయించారని అన్నారు. మాయ మాటలతో ఇష్టారీతిన లెక్కలు మారుస్తున్నారన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న హరితహారం కార్యక్రమానికి బిజెపి మద్దతు తెలుపుతుందని.. కానీ మొక్కల పేరుతో వేల కొట్ల ప్రజాధనాన్ని ఖర్చు చేస్తూ అవినీతికి పాల్పడడాన్ని ఖండిస్తునామని అన్నారు. రాష్ట్రంలో గతంలో నిర్వహించిన హరితహారానికి చేసిన ఖర్చుతో పాటు సంరక్షణ అనంతరం మిగిలిన మొక్కల సంఖ్యను ప్రకటించాలన్నారు.

## మహబూబాబాద్

# గాలికుంటు నిర్మూలనకు చర్యలు

మహబూబాబాద్, జులై 29 (నేటినిజం ప్రతినిధి):దేశంలో 2030 నాటికి పశువుల గాలికుంటు నిర్మూలనకు చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర పశుసంవర్ధకశాఖ అదనపు సంచాలకులు ఎస్.రామచందర్ పేర్కొన్నారు. డోర్నకల్ మండలం చిల్కోడులో ఆదివారం బంజర సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ దేశంలో తొలిసారిగా తెలంగాణ రాష్ట్రానికే ఉచిత టీకా సరఫరా ప్రారంభించారన్నారు. గొర్రెలు, పందులు, మేకలకు కూడా ఈ టీకాలు వేసే ఆలోచన ఉందన్నారు. పశుమిత్రలు ఆయనను కలిసి వారి సమస్యలను విన్నవించారు. అనంతరం ఆయన మొక్కలు నాటారు.

# మహా ధర్నా జయప్రదం చేయండి

మహబూబాబాద్, జులై 29 (నేటినిజం ప్రతినిధి):ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఆగస్టు 3న హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి ధర్నాను విజయవంతం చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లారెడ్డి, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు గోవర్దన్, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు జాన్‌నాయక్ కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాలలో ధర్నాకు సంబంధించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. ఆగస్టు 3న హైదరాబాద్‌లో నిర్వహించే మహాధర్నాకు ఉద్యోగ, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో రమేశ్‌కుమార్, భావ్‌సింగ్, వెంకట్, రమేశ్, లింగయ్య, శ్రీనివాస్, రాజేందర్, యుగేంధర్ తదితరులు పాల్గొన్నారు.

# భారత్‌కు ఏడు స్వర్ణాలు, రెండు రజతాలు

న్యూఢిల్లీ: పంచ్‌లకు పసిడి పతకాలు వెల్లువెత్తాయి. లాబౌన్ బాజో(ఇండోనేషియా) వేదికగా జరిగిన 23వ ప్రెసిడెంట్స్ కప్ టోర్నీలో భారత బాక్సర్లు పతకాల పంట పండించారు. ప్రతిష్ఠాత్మక టోర్నీలో తమదైన ఆధిపత్యం ప్రదర్శిస్తూ ఆఖరి రోజైన ఆదివారం ఏడు స్వర్ణాలు సహా రెండు రజత పతకాలు దక్కించుకుని తమకు తిరుగులేదని ఘనంగా చాటిచెప్పారు.

భారత బాక్సింగ్ క్వీన్ మేరికోం(51కి), మోనిక(48కి), సిమ్రన్‌జీత్‌కౌర్, జమున బోరో(54కి), అంకుశ్ దహియా(64కి), అనంత్ ప్రహ్లాద్(52కి), నీరజ్ స్వామి(49కి) స్వర్ణ పతకాలతో మెరువగా, గౌరవ్ బిధూరీ(56కి), దినేశ్ దాగర్ రజత పతకాలతో సంతృప్తిపడ్డారు.

అదుర్స్వయసు పెరిగినా వన్నె తగ్గలేదని మేరికోం మరోమారు నిరూపించింది. ముగ్గురు పిల్లలకు తల్లి అయినా తనలో చేవ తగ్గలేదని నిరూపిస్తూ అంతర్జాతీయ వేదికలపై పతకాల మోత మోగిస్తూనే ఉన్నది. రెండు నెలల క్రితమే ఇండియా ఓపెన్‌లో అదరగొట్టిన ఈ మణిపూర్ మణిపూస ప్రెసిడెంట్స్ కప్‌లోనూ ఇరుగదీసింది.

ఆదివారం జరిగిన 51కిలోల ఫైనల్లో ఆస్ట్రేలియా బాక్సర్ ఆప్రిల్ ఫ్రాంక్స్‌పై 5–0 తేడాతో ఘన విజయం సాధించింది. ప్రత్యర్థికి ఏ మాత్రం అవకాశమివ్వకుండా పదునైన పంచ్‌లతో విరుచుకుపడింది. మూడు రౌండ్లలో తనదైన ఆధిపత్యం ప్రదర్శిస్తూ కీలక పాయిం ట్లు కొల్లగొట్టింది.

అక్టోబర్‌లో జరిగే ప్రపంచ చాంపియన్‌షిప్‌నకు ముందు మేరి మెరుగైన ప్రదర్శనతో ఆకట్టుకుంది. ప్రెసిడెంట్స్ కప్‌లో స్వర్ణ పతకం నాకు, నా దేశానికి గర్వకారణం. గెలువడం ద్వారా ఇంకా కష్టపడాలన్నది తెలిసొచ్చింది. నాకు వెన్నంటి నిలిచిన కోచ్ లు, సహాయక బృందం, కేంద్ర క్రీడా మంత్రి కిరణ్ రిజిజు, సాయ్ అధికారులకు అందరికీ కృతజ్ఞతలు అని మేరి ట్వీట్ చేసింది. మిగతా విభాగాల్లో సిమ్రన్‌జీత్ కౌర్..హస్నాహ్ హుస్వాతున్‌పై, జమున బోరో 5–0తో గులియహ లావూంగపై, మోనికా..ఎండాంగ్‌పై విజయాలతో పసిడి పతకాలు నెగ్గారు.

# బౌండరీల లెక్కింపుపై ఐసీసీ సమీక్ష

క్రీడలు...



న్యూఢిల్లీ : ప్రపంచకప్ ఫైనల్‌లో తుదిస్కోర్లు సమం కావడం సహా సూపర్ ఓవర్ టై అయిన సందర్భంలో బౌండరీల లెక్క ఆధారంగా ఇంగ్లండ్‌ను విజేతగా ప్రకటించడంపై సర్వత్రా అసంతృప్తి వ్యక్తమైంది. ఈ నిబంధనను సమీక్షించాలని మాజీ, ప్రస్తుత ఆటగాళ్లు చాలా మంది డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో అనిల్ కుంబ్లే నేతృత్వంలోని కమిటీ.. బౌండరీలను లెక్కించే నిబంధనను తదుపరి సమావేశంలో సమీక్షించనుందని ఐసీసీ ఆదివారం తెలిపింది. వచ్చే ఏడాది తొలి త్రైమాసికంలో ఈ సమావేశం జరుగుతుందని వెల్లడించింది. ప్రపంచకప్ ఫైనల్ సందర్భంగా నిబంధనలపై వ్యక్తమైన అభ్యంతరాలను క్రికెట్ కమిటీ తదుపరి సమావేశంలో పరిగణలోకి తీసుకుంటుంది. మ్యాచ్ టై అయిన సందర్భంలో ఫలితం తేల్చడానికి 2009 నుంచి ఐసీసీ టోర్నీల్లో సూపర్ ఓవర్ నిర్వహిస్తున్నాం. ఒకవేళ సూపర్ ఓవర్ కూడా టై అయితే బౌండరీలు లెక్కించాలన్న నిబంధన ఉంది. ఆ మ్యాచ్‌లో అదే జరిగింది. ప్రపంచంలోని దాదాపు అన్ని దేశాల టీ20 లీగ్‌ల్లో ఇదే నిబంధన ఉంది. ప్రొఫెషనల్ క్రికెట్‌లో ఎక్కువగా అదే నిబంధన ఉన్నందున కొనసాగించాం. దీనికి మరేదైనా ప్రత్యామ్నాయం ఉంటే క్రికెట్ కమిటీ పరిశీలిస్తుంది అని ఐసీసీ జనరల్ మేనేజర్ జెఫ్ అలార్డైస్ తెలిపారు. టై అయిన సందర్భంలో భవిష్యత్తులో టైటిల్‌ను ఇరు జట్లకు పంచాలన్న విషయంపై ఐసీసీ వార్షిక సమావేశంలో ఎలాంటి చర్చ జరగలేదని స్పష్టం చేశారు. టెస్ట్ చాంపియన్‌షిప్‌ను స్వాగతిస్తున్నామన్న టీమ్‌ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ వ్యాఖ్యలపైనా ఆయన హర్షం వ్యక్తం చేశారు.

నబీఎత్రీవఐసీసీకి ఆల్‌బ్లాక్స్ పంచ్

బౌండరీ నిబంధనపై న్యూజిలాండ్ రగ్బీ జట్టు ఆల్‌బ్లాక్స్ ట్విట్టర్ వేదికగా ఐసీసీకి పంచ్ వేసింది. వెల్లింగ్టన్‌లో ఆదివారం జరిగిన ఫ్రీడమ్ కప్ ఫైనల్లో దక్షిణాఫ్రికాతో మ్యాచ్‌ను 16–16తో కివీస్ డ్రా చేసుకుంది. దీంతో ఇరు దేశాలు సంయుక్త విజేతలుగా నిలిచాయి. ఈ సందర్భంగా ట్విట్టర్‌లో ఐసీసీని పరోక్షంగా ఉద్దేశిస్తూ... వెల్లింగ్టన్‌లో బౌండరీల లెక్కింపు లేదు. ఈ మ్యాచ్ డ్రాగా ముగిసింది. అద్భుమైన మ్యాచ్ అంటూ బ్లాక్స్‌కాప్స్ ట్వీట్ చేసింది.

# నౌకాదళ సేవల్లోకి ఐఎన్ ఎల్సీయూఎల్-56



అందించనుంది. తీరప్రాంత భద్రత దిశగా పనిచేయనుంది. జవాన్లు, యుద్ధట్యాంకులు ఒక చోట నుంచి మరొక చోటికి చేర్చడానికి దీనిని ఉపయోగిస్తారు. అత్యవసర సమయాల్లో కూడా ఇది సేవలు అందించనుంది.



విశాఖపట్నం, జులై 29: నౌకాదళ సేవల్లోకి ఐఎస్ ఎల్సీయూఎల్-56 ప్రవేశించింది. విశాఖ నావెల్ డాక్ యార్డు నుంచి నౌకాదళ సేవల్లోకి నౌక ప్రవేశించింది. తూర్పు నౌకాదళాధిపతి వైఎస్ అడ్మిరల్ ఏకే జైన్ దీనిని ప్రారంభించారు. పోర్టు బ్లేయర్ కమాండ్‌లో సేవలు

# ప్రత్యామ్నాయ పంటలపై రైతుల ఆసక్తి

### ఉద్యాన పంటలతో పాటు యాపిల్ సాగు
### సేంద్రియ పద్ధతిలో పళ్లతోట పెంపకానికి ప్రోత్సాహం

భద్రాద్రికొత్తగూడెం,జూలై29(ఆర్ఎన్ఎ): విశాఖ మన్యంలో విజయం సాధించిన యాపిల్ సాగు జిల్లాలోని పలు ప్రాంతాల్లో చేపట్టారు. విశాఖ మన్యంలో ఉన్న వాతావరణ పరిస్థితుల కారణంగా అయ్ప్ త్యేక పరిస్థితులు ఉన్న ప్రాంతాల్లో రైతులు తెలంగాణ యాపిల్ సాగుతో లాభాలు పండిస్తున్నారు. అక్కడ యాపిల్ సాగు మంచి ఫలితాలు ఇచ్చింది. గిరిజనులకు లాభాలు తెచ్చి పెడుతోంది. దీంతో భద్రాద్రి జిల్లాలో కొన్నచోట్ల అనువైన వాతావకరణంలో సాగు చేపట్టగా మంచి ఫలితాలను ఇస్తోందని జిల్లా ఉద్యాన శాఖాధికారి ఒకరు పేర్కొన్నారు. బూర్గంపాడు, అశ్వారావుపేట, దమ్మపేట, సుజాతనగర్‌లలో ఈ సాగు అధికంగా చేస్తున్నారన్నారు. క్షేత్ర పర్యటనలో పలుప్రాంతాల్లో పంటతీరును పరిశీలించి రైతులతో సాగు వివరాలను తెలుసుకున్నారు. రైతులు చేపట్టిన తెలంగాణ యాపిల్ సాగును పరిశీలించారు. ఆది 6 నెలల పంట అని ఒక చెట్టుకు 20–25 కిలోల దిగుబడి మొదటి సంవత్సరం వస్తుందన్నారు. తర్వాత 50–100 కిలోల దిగుబడి వస్తుందన్నారు. సేంద్రియ పద్ధతిలో సాగుచేస్తే హెక్టార్‌కు 8వేల కిలోలదిగుబడి సాధించవచ్చు న్నారు. హెక్టార్‌కు రూ.4,80,000 ఆదాయం వస్తుందన్నారు. దీనికి మార్కెట్ డిమాండ్ కూడా ఉందన్నారు. విశాఖ మన్యంలో ఉన్న వాతావరణ పరిస్థితులు ఇక్కడా ఉన్నాయన్నారు. ఇకపోతే రైతులు కూరగాయల సాగుతో అధిక లాభాలు సాధించవచ్చని పేర్కొన్నారు. కొద్దిపాటి వ్యవసాయం చేసే రైతులకు కూరగాయల సాగు మంచి లాభసాటిగా ఉంటుందని వివరించారు. అలాగే మామిడి మొక్కలు నాటినప్పటి నుంచి యాజమాన్య పద్దతులు పాటిస్తే లాభాలు వస్తాయని అన్నారు. ప్రతి మామిడి మొక్కను మూడు అడుగుల గుంత తీసి అందులో వేపపిండి వేసి నాటాలన్నారు. మూడు నెలలకు ఒకసారి బలమైన మందులు వేసి 10 రోజులకు ఒకసారి నీటి తడులు అందించాలని గిరిజన రైతులకు సూచించారు. నీటి యాజమాన్య పద్దతుల సక్రమంగా పాటించటం వల్ల పంట బాగాపండి నాణ్య మైన పండ్లు దిగుబడి చేసుకోవచ్చని వివరించారు. మొగ్గ, పిందె దశలో తెగుళ్ల నివారణకు వాడే మందుల పై అవగాహన కల్పించారు. నాబార్డ్ అందించే సాయం కూడా పొందాలన్నారు. ప్రభుత్వం కూడా వివిధ రూపాల్లో ఆర్థిక సాయం అందిస్తోంది. దీంతో ప్రత్యామ్నాయంగా పళ్లతోటలపై రైతులు దృష్టి సారించారు.

## ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి ఉండాల్సిందే

జనగామ,జూలై29(ఆర్ఎన్ఎ): ప్రతీ ఇంట్లో మరుగుదొడ్డి నిర్మించుకోవాలని, అందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఇచ్చిన సూచనల మేరకు గ్రామాల్లో ప్రచారం చేపట్టారు. సర్పంచ్‌లు కడా ఇందుకు మరుగదొడ్లు కట్టించుకోవాలని ప్రోత్సహిస్తున్నారు. ప్రతీ ఇంట్లో మరుగుదొడ్డి ఉండాలని, నిర్మించుకోని వారుంటే వెంటనే నిర్మించుకోవాలన్నారు. గ్రామంలో ఆరుబయటకు వెళ్తున్న వారిని గుర్తించి మరుగుదొడ్డి నిర్మించుకోవడానికి కృషి చేయాలన్నారు. లేకుంటే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మిషన్ భగీరథ నీరు గ్రామాల్లోకి సరిగా వచ్చే విధంగా గేట్‌వాల్వ్‌లు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే ప్రతి ఒక్కరూ హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. బహిరంగ మలవిసర్జన నిర్మూలన కోసం వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు. గ్రామాల్లో సంపూర్ణ పారిశుద్ధ్యమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. వీటితోపాటు ఇళ్లలో నుంచి వెలువడే మురుగు నీరు వీధుల వెంట ప్రవహించకుండా ఎక్కడికక్కడే ఇంకిపోయేలా ఇంకుడుగుంతలు తవ్వుకోవాలని కోరారు. పశువుల పేడ, వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడేయకుండా ప్రభుత్వం మంజూరు చేస్తున్న కంపోస్టు పిట్స్‌లో వేసుకొని సేంద్రియ ఎరువును తయారు చేసుకోవాలని సూచించారు. ఈ మూడు పథకాలలో ప్రభుత్వం నుంచే నిధులు మంజూరు చేస్తున్నందున ఎవరికీ ఒక్క పైసా కూడా ఖర్చు చేయాల్సిన అవసరం ఉండదన్నారు. రోగాలు లేని జీవితం కోసం ఈ మూడు నిర్మాణాలను ప్రతి ఇంట్లో తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని సూచించారు. ప్రతి గ్రామంలో పారిశుధ్య పనులు నిర్వహించాలని సూచించారు. తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయాలని, పంచాయతీ కార్యాలయాలకు, ట్యాంకులకు రంగులు వేయాలని సూచించారు. డ్రైనేజీలను శుభ్రపరచాలని, మురుగు నీరు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

# తరుగు పేరుతో రైతు దోపిడీ

### పట్టించుకోని పాలకవర్గాలు

నల్లగొండ,జూలై29 (ఆర్ఎన్ఎ): తరుగుపేరుతో రైతులను దోచేస్తున్నారు. వ్యాపారులు పాత పద్ధతిలోనే తరుగు తీసుకుంటున్నారు. కిలో తరుగు వల్ల ఎకరానికి బస్తా తేడా వస్తుంది. అన్నదాత ఆరుగాలం కష్టించి పండించిన పంటను వ్యాపారులు కిలో తరుగుతో దోచేస్తున్నారు. ఇలా ఒక్కో రైతు నగటున ఎకరానికి రూ.750 నుంచి రూ.850 వరకు నష్టపోతున్నాడు. ఈ పరిస్థితిలో మార్పు తేవాలని ఏటా సీజన్‌లో అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు ఇస్తున్నా మార్పులేదు. ఇలా ఏటా రెండు సీజన్‌లలో రైతులు సుమారు కోట్ల వేర దోపిడీకి గురువుతున్నారు. ఇక్కడి వ్యాపారులు రెండు కిలోలు తూకం అదనంగా వేసుకుని మిర్యాలగూడ, హుజూర్‌నగర్, సూర్యాపేట, కోదాడ వంటి పట్టణాలలో కిలో తరుగుతోనే అమ్ముతున్నారు. పట్టుపడినా కేసులు లేకుండా పైరవీలు చేసుకుని వ్యాపార దందా సాగిస్తున్నారు. ప్రధాన పట్టణాలలో మిల్లులు ఉన్న చోట తరుగు విధానం లేదు. కేవలం కిలో తరుగుతోనే కాంటాలు జరుగుతున్నాయి. లైసెన్సు లేకుండా గ్రామాల్లో వ్యాపారులు ధాన్యం కొనుగోలు చేస్తూ రైతులను మోసం చేస్తున్నా అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. గతంలో రెండుమూడు సార్లు తహసీల్దారు కార్యాలయానికి పిలిపించి కిలో తరుగుతోనే కాంటాలు వేసుకోవాలని సూచించినా ఎవరూ పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. సంచితో కాంటా వేస్తే.. బస్తా బరువు కింద అదనంగా కిలో తూకం వేయాలి. వ్యాపారులు అదనంగా రెండు కిలోలు అంటే 72 కిలోలు వేసుకుంటున్నారు. గతంలో కళ్లాలు చేసేటపుడు పట్టలు లేక నేలపై నూర్పిడి చేసేవారు. అపుడు కళ్లాలలో మట్టి, ఎగపోత సమయంలో గాలికి వెళ్లని చెత్త ఎక్కువగా ఉంటుందని కిలో అదనంగా తూకం వేసుకునే వారు. ఇపుడు అలాంటి పరిస్థితి లేదు. వరికోత యంత్రాలతో పనులు చేస్తున్నందున మట్టి, చెత్తా లేకుండా శుభ్రంగా వస్తున్నాయి. తరుగు తీయాల్సిన అవసరం లేదు.

# సాగునీటి ప్రాజెక్టులపై అనవసర విమర్శలు

### విపక్షాలు విమర్శలు మానాలి

ఖమ్మం,జూలై29(ఆర్ఎన్ఎ): మిషన్‌భగీరథ, మిషన్ కాకతీయ కార్యక్రమాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే పువ్వాడ అజయ్ అన్నారు. సాగునీటి రంగంపై తెలంగాణ ప్రభుత్వం ఉద్దేశ్యాలను, లక్ష్యాలను ముఖ్యమంత్రి ప్రజలకు వివరిస్తూనే ఉన్నారని మంత్రి చెప్పారు. రైతుల కష్టాలు తనకు తెలుసునని పేర్కొన్నారు. రైతులు బాధులు పడుతుంటే చూస్తూ ఊరుకునే ప్రభుత్వం తమది కాదన్నారు. రాష్ట్రంతో పాటు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులను అడ్డుకునేందుకు విపక్షాలు చేయని ప్రయత్నం లేదని ధ్వజమెత్తారు. వ్యవసాయం అంటేనే రైతులు భయపడ్డారన్నారు. ప్రభుత్వం సాగునీటి రంగంతో పాటుగా వ్యవసాయ రంగంలో సైతం విప్లవాత్మక మార్పులను తీసుకువస్తుందన్నారు. ఆధునిక పరిజ్ఞానంతో పాలీ హౌస్ వంటి సాగును సబ్సిడీలు ఇస్తు ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. గోదావరి జలాలను తీసుకువచ్చేందుకు కసరత్తు జరుగుతుందన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఆటంక పర్చకపోతే వరుస ఎన్నికల్లో పరాభవానికి గురవుతున్నామని, ప్రజలంతా ఏకపక్షంగా ఉన్నారని, వారి మనసుల్ని కలుషితం చేయాలని కుట్రలు పన్నుతున్నారని చెప్పారు. కానీ ప్రజలు, రైతాంగం కష్టాలను కళ్లారా చూసిన సీఎం కేసీఆర్ సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సంపూర్ణ సహకారం అందించటంతో నిర్ణీత గడువుకు ముందే భక్తరామదాసు ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేశామని పేర్కొన్నారు. రాష్ట్రంలో, జిల్లాలో రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూస్తున్న విపక్షాలు సాగునీటి ప్రాజెక్టుల్ని అడ్డుకోవాలని చూస్తున్నాయని అన్నారు. ఎగువ రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్ర ప్రభుత్వాలు కృష్ణా నదిపై వంద మీటర్లకో చెక్ డ్యాం నిర్మించుకున్న కారణంగా కృష్ణా బేసిన్‌లో నీటి లభ్యత తగ్గిందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో తెలంగాణకు గోదావరి నీటి అవసరాన్ని గుర్తించిన సీఎం కేసీఆర్ పలు భారీ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు.

పాలేరు జలాశయం నుంచి క్రిష్ణా జలాలను శ్రీరాంసాగర్ కాల్వల ద్వారా సరఫరా చేసేలా ఎత్తిపోతల పథకాన్ని రూపొందించి బీడు భూములను సస్యశ్యామలం చేస్తున్నామన్నారు. జిల్లా సాగు, తాగునీటి అవసరాలకు తలమానికమైన సీతారామ ప్రాజెక్ట్ పనులను కూడా పూర్తి చేస్తామన్నారు.

# ముందుకు కదలని బాసర అభివృద్ధి మాస్టర్ ప్లాన్

### ఆమోదం వచ్చినా కదలని అధికారులు?

నిర్మల్,జూలై29(ఆర్ఎన్ఎ): దేశంలో రెండోది.. దక్షిణ భారతదేశంలో ఏకైక దేవాలయంగా పేరొందిన బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయానికి మహర్దశ పట్టనుంది.. చదువుల తల్లి కొలువై ఉన్న బాసర పుణ్యక్షేత్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. అయితే ఇప్పటి వరకు పనులకు సంబంధించి పనులు ముందుకు సాగలేదు. సరస్వతీ అమ్మవారి ఆలయ విస్తరణ, దర్శనానికి వచ్చే భక్తుల సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టారు. యాత్రికులకు అన్ని హంగులు, ఆధునిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు చేపట్టింది. యాదాద్రి విస్తరణ జరుగుతన్న నేపథ్యంలో ఇతర ప్రధాన ఆలయాల అభివృద్ధిపైనా ప్రభుత్వం దృష్టి సారించింది. అప్పట్లో నిధులు విడుదలయినా మాస్టర్ ప్లాన్ మేరకు పనులు చేపట్టాల్సి ఉంది. భక్తుల సౌకర్యార్థం ప్రభుత్వం ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందించినట్లు మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి కూడా ప్రకటించారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు బాసర ఆలయ అభివృద్ధికి రూ.50కోట్లు మంజూరీ చేసింది. బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయం, పుణ్యక్షేత్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని సిఎం కెసిఆర్ గతంలోనే హామీ ఇచ్చారు. బాసర పుణ్యక్షేత్రం అభివృద్ధికి ముందుగా రూ.50కోట్లు మంజూరు చేసారు. బాసర జ్ఞాన సరస్వతి దేవాలయంతో పాటు పుణ్యక్షేత్రంలో మార్పులు, చేర్పులు చేయడం, వాస్తు ప్రకారం నిర్మించేందుకుగాను స్తపతి గతంలో పరిశీలించి పలు సూచనలు చేశారు. ఇక ఇంజినీరింగ్ పనులకు సంబంధించి ఎఫ్‌హెచ్‌డీ కనస్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ వారు కూడా అప్పట్లో పరిశీలించి.. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ మేరకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.50కోట్లతో ఆలయ అభివృద్ధి, మార్పులు, చేర్పులతో ఇతర నిర్మాణాలు, పనులు చేపట్టనున్నారు. బాసర ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తామని సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు పనులు సాగుతాయని మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి కూడా అన్నారు. బాసర ఆలయ అభివృద్ధి, విస్తరణకు త్వరలో బృహత్తర ప్రణాళిక రూపొందించనున్నట్లు దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు. బాసర ఆలయ అభివృద్ధి నమూనా విషయంలో సీఎం కేసీఆర్ ఆగమ శాస్త్ర పండితుల సలహాలు, సూచనలు తీసుకుంటున్నారన్నారు. తుది డిజైన్ ఖరారు చేశాక.. టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామని మంత్రి అల్లోల వెల్లడించారు.

సినిమా..

# 'కేజీఎఫ్ 2' సంజయ్ దత్ ఫస్ట్ లుక్ రిలీజ్




'కేజీఎఫ్' చిత్రంతో కన్నడనాట రికార్డు సృష్టించిన నటుడు యశ్. ఇప్పుడు దీనికి కొనసాగింపుగా 'కేజీఎఫ్' చాప్టర్ 2ను తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన సర్‌ప్రైజ్‌ను చిత్రబృందం సోమవారం విడుదల చేసింది. ఈరోజు బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ పుట్టినరోజును పురస్కరించుకుని సినిమాలోని ఆయన లుక్‌ను విడుదల చేశారు. ఇందులో ఆయన పాత్ర పేరు అధీర. తలపాగా చుట్టుకుని కళ్లు మాత్రమే కనిపించేలా తీర్చిదిద్దిన ఆయన లుక్ ఉత్కంఠగా ఉంది. ఈ సినిమాకు కూడా ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీనిధి శెట్టి కథానాయికగా నటిస్తున్నారు. హోంబళే ఫిలింస్, వారాహి చలన చిత్ర సంస్థలు సంయుక్తంగా సినిమాను నిర్మిస్తున్నాయి.

# ఆగస్ట్ 2న 'శివరంజని' రిలీజ్



తొలిసారిగా హోలీ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ అమ్మడు ఆ తర్వాత 'గుంటూరు టాకీస్', నెక్ట్స్ నువ్వే వంటి చిత్రాలలో లీడ్ రోల్ పోషించింది. బుల్లితెరపై మంచి పేరు తెచ్చుకున్న ఈ అమ్మడు వెండితెరపై మాత్రం అంతగా ఆకట్టుకోలేకపోతుంది. తాజాగా శివరంజని అనే హారర్ సినిమాతో అలరించేందుకు సిద్ధమైంది. ఇటీవల చిత్ర ట్రైలర్ విడుదల కాగా, దీనికి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఆగస్ట్ 2న చిత్రాన్ని విడుదల చేస్తున్నట్టు మేకర్స్ ప్రకటించారు. ఆరోజు రాక్షసుడు, గుణ 369 వంటి చిత్రాలు థియేటర్స్‌లోకి రానుండగా, ఆ చిత్రాలకి పోటీగా ఈ చిత్రం ఉంటుందా

యాంకర్ రష్మి ఇటు బుల్లితెరపై సందడి చేస్తూనే అడపాదడపా వెండితెరపై తన అదృష్టాన్ని పరీక్షించుకుంటుంది. వెండితెరపై అనేది సగటు అభిమాని ప్రశ్న. శివరంజని చిత్రం అయిన రష్మికి మంచి విజయం అందిస్తుందా లేదా అనేది చూడాలి.

# నిర్మాతగా అమలాపాల్ ?



కోలీవుడ్ హీరోయిన్ అమలాపాల్ తెలుగులో స్ట్రయిట్‌గా 'బెజవాడ', 'నాయక్', 'ఇద్దరమ్మాయిలతో' సినిమాల్లో నటించింది. రీసెంట్‌గా 'ఆ'మె చిత్రంలో బోల్డ్ సీన్ చేసి అందరినీ ఆశ్చర్యపరిచిన ఈ అమ్మడు ఇప్పుడు నిర్మాతగా కూడా మారారు. తమిళంలో ఇప్పటికే తన నిర్మాణంలో సినిమాను ప్రారంభించిన అమలా, త్వరలోనే తెలుగులో కూడా ఓ సినిమా చేయనుందట. ఓ కొత్త దర్శకుడు చెప్పిన కథ నచ్చడంతో అమలాపాల్ ఆ సినిమాలో నటిస్తూ నిర్మించాలనుకుంటుందని వార్తలు వినపడుతున్నాయి. త్వరలోనే మణిరత్నం దర్శకత్వంలో తెరకెక్కబోయే పొన్నియన్ సెల్వన్ చిత్రంలో అమలాపాల్ కీలక పాత్రలో నటించనున్నారు.

# నాలోని నటిని ప్రేక్షకులు గుర్తించారు : కృతీసనన్

'హీరోయిన్‌గా అవకాశం తెచ్చుకోవడం కంటే నటిగా ప్రేక్షకుల మెప్పు పొందడమే నాకు ఇష్టం' అంటున్నారు కథానాయిక కృతీసనన్. మహేశ్‌బాబు 'వన్: నేనొక్కడినే', నాగచైతన్య 'దోచేయ్' సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన ఈ బ్యూటీ ప్రస్తుతం బాలీవుడ్‌లో మంచి ఆఫర్లను చేజిక్కించుకుంటూ బిజీ హీరోయిన్‌గా మారే ప్రయత్నాల్లో ఉన్నారు. తాను నటిగా నిరూపించుకున్న విషయం గురించి మాట్లాడుతూ ..'బరేలీ కీ బర్ఫీ' (2017) సినిమా విడుదలకు ముందు నన్ను అందరూ గ్లామర్ పాత్రలే చేయగలదన్నారు. కానీ ఈ సినిమాలో నేను చేసిన పాత్ర ఆ ముద్రను చెరిపేసింది. నాకు మంచి ప్రశంసలు దక్కాయి. అవకాశాలు పెరిగాయి. నన్ను కేవలం ఒక గ్లామరస్ హీరోయిన్‌గా మాత్రమే కాకుండా నాలోని నటిని కూడా ప్రేక్షకులు గుర్తించారు. నా కెరీర్‌లో ఈ సినిమా ఓ కీలకమైన మలుపును తీసుకొచ్చిందని చెప్పగలను' అని చెప్పుకొచ్చారు కృతీ. 'అర్జున్ పటియాలా', 'హౌస్‌ఫుల్ 4' చిత్రాల షూటింగ్స్‌ను కంప్లీట్ చేసిన ఈ బ్యూటీ ప్రస్తుతం 'పానిపట్' అనే పీరియాడికల్ సినిమాతో బిజీగా ఉన్నారు.



# హరితహారంలో విద్యార్థులు పాల్గొనాలి

## ఎక్కడికక్కడే మొక్కల పెంపకాన్ని చేపట్టాలి

నిజామాబాద్, జూలై 29 (ఆర్ఎన్ఎ): ఈ సంవత్సరం హరితహారంలో భాగంగా జిల్లాలో ఇప్పటికే మొక్కల పెంపకం చేపట్టారు. తాజాగా కురుస్తున్న వర్షాల కారణంగా ఎక్కడిక్కడే మొక్కల పెంపకాన్ని చేపట్టాలని డీఆర్డీవో పిడి సూచించారు. పాఠశాలల్లో విద్యార్థులకు మొక్కల ప్రాధాన్యత వివరించి ఇంటి ఆవరణల్లో సైతం మొక్కలు నాటేలా చూడాలన్నారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటించి వాటి సంరక్షణను ఉపాధ్యాయులు పర్యవేక్షించాలన్నారు. ప్రతీ క్షేత్ర సహాయకుడు ఉద్యమంలా పనిచేసి నెలాఖరు వరకు లక్ష్యాన్ని చేరుకోవాలని ఆదేశించారు. మొక్కలు నాటడంలో అశ్రద్ధ వహించవద్దన్నారు. మొక్కల సంరక్షణకు వాచర్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రతీ వాచర్ 400 నుంచి వెయ్యి మొక్కలను నాటి వాటికి కంచె వేసి వారానికి ఒకసారి నీళ్లు పోయాలన్నారు. వాచర్‌కు ప్రతినెలా మొక్కకు 5 రూపాయలను ఇవ్వనున్నట్లు చెప్పారు. వాచర్ల పనితీరును గమనించడానికి ప్రతీ నలుగురు వాచర్‌లపై ఒక సూపర్‌వైజర్‌ను ఏర్పాటుచేసి పనులను పర్యవేక్షిస్తారని అన్నారు. మొక్కలతోనే పర్యావరణ సమతుల్యత సాధ్యమని, ప్రతిఒక్కరూ హరితహారం కార్యక్రమంలో భాగస్వాములై పెద్ద సంఖ్యలో మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. హరితహారం ప్రభుత్వ కార్యక్రమమే కాదని, అందరిదని.. ప్రజలు భాగస్వామ్యమై విజయవంతం చేయాలన్నారు. మానవాళి మనుగడలో చెట్ల ప్రాముఖ్యత ఎంతో ఉందన్నారు. మంచి వాతావరణం కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, తల్లి వేరు లాంటి కవి తన సాహిత్యంతో హరితహారం గురించి శాఖోపశాఖలుగా ప్రజల్లోకి విస్తరింపచేయాలని అన్నారు. కవులు, రచయితలు, చెట్ల పెంపకం, పచ్చదనంతోనే మానవుని మనుగడ, ఆకుపచ్చ తెలంగాణ, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలపై చైతన్యం చేయలన్నారు. హృదయాన్ని తాకే విధంగా ప్రజల్లోకి వెళ్లగలిగేది కవి మాత్రమే అన్నారు.

72 ఏళ్ల తర్వాత ..

# పాక్‌లో తెరుచుకోనున్న హిందూ ఆలయం

కరాచీ, జులై29(ఆర్ఎన్ఎ) : వెయ్యేళ్ల చరిత్ర కలిగిన ఓ హిందూ దేవాలయానికి మళ్లీ మహర్దశ రాబోతోంది. పాకిస్థాన్‌లోని సియాల్ కోట్ ఈ పురాతన ఆలయం ఉంది. సర్దార్ తేజా సింగ్ ఈ షావాలా తేజాసింగ్ ఆలయాన్ని నిర్మించారు. భారత్, పాక్ విభజన సమయంలో 72 ఏళ్ల క్రితం ఈ ఆలయం మూతపడింది. భారత్ లో బాబ్రీ మసీదును కూల్చివేసిన అనంతరం... 1992లో ఓ గుంపు ఈ ఆలయంపై దాడి చేసి ధ్వంసం చేసింది. ఆ తర్వాత ఈ ఆలయం వద్దకు హిందువులు రావడం ఆపేశారు. ఈ ఆలయాన్ని మళ్లీ తెరవాలని పాకిస్థాన్ ప్రభుత్వం నిర్ణయించింది. ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ఆదేశాల మేరకు ఆలయాన్ని తెరవాలని నిర్ణయించినట్టు పాక్ మీడియా వెల్లడించింది. ఆలయంలో దెబ్బతిన్న భాగాలను పునరుద్ధరించాలని కూడా పాక్ ప్రభుత్వం నిర్ణయించింది. ఆలయాన్ని పరిరక్షించే పనులను కూడా ప్రారంభించబోతోంది. ఈ సందర్భంగా సియాల్ కోట్ డిప్యూటీ కమిషనర్ బిలాల్ హైదర్ మాట్లాడుతూ.. ఆలయాన్ని ప్రజలు స్వేచ్ఛగా దర్శించుకోవచ్చని తెలిపారు.

# మోడీ సాహసయాత్ర!

## – ఆగస్టు 12న ప్రసారం చేయనున్న డిస్కవరీ ఛానెల్

న్యూఢిల్లీ, జులై29(ఆర్ఎన్ఎ) : దమ్ము, ధైర్యం, సాహసం, సమయస్ఫూర్తి.. ఇవన్నీ పుష్కలంగా ఉన్న వ్యక్తి మన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ. రాజకీయాల్లో ఎవరెదురొచ్చినా తన చాతుర్యంతో చిత్తు చేసే మోడీ.. క్రూర మృగాలు, విష సర్పాలు ఎదురైతే ఎలా డీల్ చేస్తారు? నదులు అడ్డొస్తే ఎలా దాటుతారు? అడవిలో ఉండాల్సి వస్తే అసలు ఆయనేం చేస్తారు..? ఇవన్నీ తెలుసుకోవాలనుకుంటే మరో 15రోజులు ఆగాల్సిందే.

ఇంతకీ విషయమేంటంటే.. డిస్కవరీ ఛానెల్‌లో ప్రసారమయ్యే పాపులర్ షో 'మేన్ వర్సెస్ వైల్డ్'లో త్వరలో మన మోడీ కనపించబోతున్నారు. ప్రపంచ ప్రముఖ సాహసవీరుడు బియర్ గ్రిల్స్‌తో కలిసి మోడీ చేసిన వైల్డ్ జర్నీని డిస్కవరీ ఛానెల్ ఆగస్టు 12న ప్రసారం చేయబోతోంది. భారత్‌లోని వన్యప్రాణుల సంరక్షణ, పర్యావరణ మార్పులపై ఈ షోలో మోడి చెప్పబోతున్నట్టు తెలిసింది. ఇందుకు సంబంధించిన ప్రోమో కొద్ది సేపటి క్రితం విడుదలైంది. ఈ షోను తప్పకుండా చూడాలని కోరుతూ బియర్ గ్రిల్స్ ఆ వీడియోను ట్వీట్ చేశాడు. మోడీ.. తనలోని కొత్త కోణాన్ని ఆవిష్కరించారని.. ఆయనలోని 'వైల్డ్ యాంగిల్'ను చూడాలంటే ఆగస్ట 12వరకు వెయిట్ చేయండి అని ఆసక్తిని పెంచాడు. మోడీ సాహసయాత్ర ప్రోమోను మీరూ చూసేయండి..



తొలిబడ్జెట్‌లోనే..

# రాజన్నపాలన గుర్తుకొస్తుంది

## – పాదయాత్రలో ఇచ్చిన ప్రతీహామీని జగన్ నెరవేస్తున్నారు
## – మాటమీద నిలబడే సీఎంను వైఎస్ తరువాత మళ్లీ ఇప్పుడే చూస్తున్నాం
## – ద్రవ్యవినిమయ బిల్లుపై చర్చలో ఎమ్మెల్యే రోజా

అమరావతి, జులై29(ఆంఎన్ఎ) : వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తన మొదటి బ్జడెట్‌లోని ప్రతి రూపాయిని ప్రజలకు అందించేలా చర్యలు తీసుకుందని, ప్రజా సంక్షేమమే ప్రాధాన్యంగా రూపొందిన ఈ బ్జడెట్‌కు సంబంధించిన ద్రవ్యవినిమయ బిల్లును మనసాక్షి కలిగిన ఎవరూ వ్యతిరేకించబోరని వైసీపీ ఎమెల్యే, ఏపీఐఐసీ చైర్మన్ శ్రీమతి ఆర్కే రోజా స్పష్టం చేశారు. ద్రవ్య వినిమయ బిల్లుపై అసెంబ్లీలో జరిగిన చర్చలో ఆమె మాట్లాడుతూ.. దేశం గర్వించే పథకాలను ప్రవేశపెట్టి.. తెలుగువాడి పాలనా దక్షతను చాటిన వైఎస్ఆర్ చాటారని, అతని మరణానంతరం పేద ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని రోజా పేర్కొన్నారు. ఆ తర్వాత ఇన్నాళ్లకు వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బ్జడెట్‌ను చూసి మళ్లీ రాజన్న రాజ్యం వచ్చిందని ప్రతి ఒక్కరూ గుండెమీద చేయి వేసుకొని ధైర్యంగా చెప్తున్నారని కొనియాడారు. చరిత్రలోనే మొదటిసారి రైతులు, విద్యార్థులు, అవ్వతాతలు, ప్రైవేటు ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఆటో డ్రైవర్లు, బట్టలు కుట్టే ట్రైలర్లు, మత్స్యకారులు, నాయి బ్రాహ్మణాలు ఇలా అన్ని వర్గాలు ప్రజలు.. ఐదుకోట్లమంది ఇది మా బ్జడెట్ అని సంతోషం వ్యక్తం చేస్తున్నారని, ఇందుకుగాను సీఎం వైఎస్ జగన్‌కు, ఆయన సూచనల మేరకు బ్జడెట్ రూపొందించిన ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి రోజా అభినందనలు తెలిపారు. ఇప్పటివరకు హైకమాండ్ ఆడించే సీఎం, సీల్డ్‌కవర్ సీఎం, ప్రజలను ఛీటింగ్ చేసే సీఎంను చూశాం కానీ, మొట్టమొదటిసారిగా మాట మీద నిలబడే సీఎం ఇప్పుడే చూస్తున్నామని, అన్నారు. పాదయాత్రలో ఇచ్చిన ప్రతి మాటను సీఎం వైఎస్ జగన్ నిలబెట్టుకున్నారని పేర్కొన్నారు. ప్రజలు ఒక నాయకుణ్ని నమ్మితే ఇంతలా నమ్ముతారా? అనేరీతిలో వైఎస్ జగన్ ఇటీవల ఎన్నికల్లో చరిత్ర సృష్టించారని రోజా పేర్కొన్నారు. ప్రధానుల కొడుకుల్ని చూశాం, ముఖ్యమంత్రుల కొడుకుల్ని చూశాం కానీ, వైఎస్సార్ కొడుకులాంటి కొడుకుని ఇక చూడబోమని రోజా కొనియాడారు. గతంలో సీఎంగా ఉన్న చంద్రబాబు, ఆయన కొడుకు 123 ఎమ్మెల్యేలు ఉన్న పార్టీని 23 ఎమ్మెల్యేలకు తీసుకొచ్చారని ఎద్దేవా చేశారు. చివరకు తన సొంత కొడుకునీ గెలిపించుకోలేని దౌర్భాగ్య పరిస్థితుల్లో చంద్రబాబు ఉన్నారని రోజా ధ్వజమెత్తారు. తన సీటును తాను గెలుచుకోలేని లోకేశ్.. అడ్డదారిలో వచ్చిన ఎమ్మెల్సీ పదవితో రాజకీయ పబ్బం గడుపుకుంటూ మళ్లీ తమకే ప్రశ్నలు వేస్తున్నాడని, అతని అమాయకత్వానికి నవ్వాలో, ఏడ్వాలో అర్థం కావడం లేదన్నారు. తన 40 ఏళ్ల రాజకీయ అనుభవంలో తానుచేయలేని సంచలన చట్టాలు, విప్లవాత్మక పథకాలు.. 45 ఏళ్ల యువకుడు చేస్తుంటే.. చంద్రబాబు ఏ మొహం పెట్టుకొని ఎలా తిరుగుతారని, అందుకే ఆయన అసెంబ్లీలో పారిపోయారని రోజా ఎద్దేవా చేశారు.

# రూ.1188 మధురం ప్రీపెయిడ్ ప్లాన్‌ను లాంచ్ చేసిన బీఎస్ఎన్ఎల్

హైదరాబాద్, జులై 29:ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ బీఎస్ఎన్ఎల్ రూ.1188 మధురం ప్రీపెయిడ్ ప్లాన్‌ను ఇవాళ ప్రవేశపెట్టింది.

ఇందులో అన్‌లిమిటెడ్ వాయిస్ కాల్స్, ఉచిత నేషనల్ రోమింగ్, 5 జీబీ డేటా, 1200 ఎస్ఎంఎస్‌లు లభిస్తాయి. ఈ ప్లాన్ వాలిడిటీ 345 రోజులుగా ఉంది.

అయితే ప్రస్తుతం ఈ ప్లాన్ కేవలం తమిళనాడు సర్కిల్ వినియోగదారులకు మాత్రమే అందుబాటులో ఉండగా.. త్వరలోనే ఇతర సర్కిళ్లకు చెందిన వినియోగదారులకు కూడా ఈ ప్లాన్‌ను అందివ్వనున్నారు.

# ముద్దుపెట్టిన యువకుడి చెంప చెళ్లుమనిపించిన ఎస్ఐ

## – బోనాల జాతర సందర్భంగా ఘటన
## – సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన వీడియో

హైదరాబాద్, జులై29(ఆర్ఎన్ఎ) : హైదరాబాద్‌లో బోనాల జాతర వైభవంగా జరుగుతోంది. అమ్మవారికి బోనాలు సమర్పిస్తూ భక్తులు మొక్కులు చెల్లించుకుంటున్నారు. నగరంలో ఎక్కడ చూసినా సందడి వాతావరణం కనిపిస్తోంది. అయితే బోనాల జాతర బందోబస్తుకు వెళ్లిన ఓ ఎస్సైకు యువకుడు షాకిచ్చాడు. మందు కిక్కు తలకెక్కిందో ఏమో.. ఎస్సై దగ్గరకు వెళ్లి గట్టిగా ఓ ముద్దు పెట్టాడు. నల్లకుంటలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వివరాల్లోకి వెళితే.. నల్లకుంట సమీపంలో బోనాల జాతరలో భాగంగా ఊరేగింపు నిర్వహించారు. డప్పు వాయిద్యాలతో సందడి వాతావరణం కనిపించింది. స్థానిక యువకులంతా తీన్మార్ స్టెప్పులతో ఎంజాయ్ చేస్తున్నారు. ఆ పక్కనే నల్లకుంట ఎస్సై మహేందర్ బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కానిస్టేబుళ్లతో కలిసి భద్రతను పర్యవేక్షిస్తున్నారు. ఎస్సై మహేందర్ యువకులు డ్యాన్స్ చేస్తున్న సమయంలో అటుగా వెళ్లారు. ఎస్సై అటుగా రావడాన్ని గమనించిన ఓ యువకుడు.. ఆయన్ను పట్టుకొని

గట్టిగా ముద్దు పెట్టాడు. ఈ హఠాత్ పరిణామంతో షాక్ తిన్న ఎస్సై మహేందర్.. యువకుడి చెంప చెళ్లుమనిపించాడు. కోపం వస్తున్నా కంట్రోల్ చేసుకున్న ఆయన అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ సీన్ మొత్తాన్ని దగ్గరలో ఉన్న మరో వ్యక్తి మొబైల్‌లో రికార్డ్ చేశాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఎస్సైకు ముద్దు పెట్టిన యువకుడు మద్యం మత్తులో ఉన్నట్లు తెలుస్తోంది

## ఏపీలో ఏడుగురు ఐపీఎస్ అధికారుల బదిలీ

అమరావతి, జులై29(ఆర్ ఎన్ఎ) : ఆంధ్రప్రదేశ్‌లో ఏడుగురు ఐపీఎస్ అధికారులకు స్థాన చలనం కలిగింది. ఐపీఎస్ అధికారులను బదలీ చేస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నర్సీపట్నం ఏఎస్పీగా వై.రిషాంత్ రెడ్డి, రంపచోడవరం ఓఎస్డీగా ఆరిఫ్ హాఫీజ్ , రంపచోడవరం ఏఎస్పీగా వకుల్ జిందాల్, గ్రేహౌండ్స్ స్క్వాడ్రన్ కమాండర్‌గా రాహుల్ దేవ్ సింగ్, విశాఖపట్నం అదనపు ఎస్పీ అడ్మిన్‌గా అజితా వేజెండ్ల, బొబ్బిలి ఏఎస్పీ గ్రేడ్ వన్‌గా గౌతమి, పార్వతీపురం ఏఎస్పీ గ్రేడ్ వన్‌గా గరుడ్ సుమిత్ సునీల్ ను నియమిస్తూ ప్రభుత్వం తన ఉత్తర్వుల్లో పేర్కొంది.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com